teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్


నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 163 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 6 అక్టోబర్ 2024 | పేజీలు : 08 | వెల ‚5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## పదో తరగతి వార్షిక పరీక్షల్లో జనరల్ సైన్స్ పరీక్షలు వేర్వేరు

**ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కీలక ఉత్తర్వులు జారీ**



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఇక నుంచి పదో తరగతి వార్షిక పరీక్షల్లో జనరల్ సైన్స్ పరీక్షలు వేర్వేరు రోజుల్లో జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఫిజికల్ సైన్స్, బయాలజీ పరీక్షలు ఒకే రోజు నిర్వహిస్తూ వచ్చారు. ఈ సారి నుంచి ఫిజికల్ సైన్స్ పరీక్ష ఒక రోజు బయాలజీ పరీక్ష మరో రోజు జరగుతుంది. అయితే గతంలో ఈ రెండు ఎగ్జామ్స్ ఒకేరోజు జరగగా తాజాగా రెండు రోజుల పాటు పరీక్షలు జరపాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఒక్కో పేపర్‌కు ఎప్పటిలాగే గంటన్నర సమయం ఇవ్వనున్నట్లు తెలిపింది. మిగతా పరీక్షలకు ఒకటే పేపర్ అయినందున మూడు గంటల పాటు సమయం ఇస్తారు. కాగా కరోనా సంక్షోభం తర్వాత పదో తరగతి వార్షిక పేపర్లను 11నుంచి 6కు తగ్గించిన విషయం తెలిసిందే.



# ఎన్ని సార్లు చెప్పాలి..

## సుప్రీం కోర్ట్ అసహనం

గతంలోనే ఆదేశించినప్పటికి అమలుచేయరేం..

వలసకార్మికుల రేషన్ కార్డు జారీ విషయంలో కోర్ట్ ఆగ్రహం

నవంబరు 19.. చర్యలకు ఇదే చివరి అవకాశం

రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం ఆదేశాలు



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): వలస కార్మికులకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు రేషన్ కార్డులను జారీ చేయడం లేదు. వీరు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని సుప్రీంకోర్టు కరోనా సమయంలో 2020లో సుమోటాగా విచారణ చేపట్టింది. దీని పలు సార్లు విచారణ చేసింది. ఈ క్రమంలో జాతీయ ఆహార భద్రత చట్టం కింద కోటాతో సంబంధం లేకుండా ఈ-శ్రమ్ పోర్టల్లో దరఖాస్తు చేసుకున్న దాదాపు 8 కోట్ల వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని 2021లో

మిగతా 2 లో





## నటుడు నాగార్జునపై రేవంత్ రెడ్డి సర్కార్ కక్ష సాధింపు..?

**హెచ్చరించిన మరుసటి రోజే నాగార్జునపై కేసు నమోదు**

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): సినీ నటుడు నాగార్జునపై రేవంత్ రెడ్డి సర్కార్ కక్ష సాధింపు చర్యలకు దిగింది. సమంత - నాగచైతన్య విడాకులపై మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై చర్యలు తీసుకుంటామని నాగార్జున హెచ్చరించిన మరుసటి రోజే ఆయనపై కేసు

మిగతా 2 లో

# సీఎం రేవంత్ రెడ్డిపై పరువు నష్టం దావా వేస్తా



**గబ్బు మాటలకు.. చెడ్డ మాటలకు సమాధానం చెబుతాం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వాఖ్యలు**

రంగారెడ్డి, జిల్లా, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): దిక్కుమాలిన మాటలు, రోతపుట్టించే మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన మంత్రివర్గాన్ని విడిచిపెట్టే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా త్వరలోనే పరువు నష్టం దావా వేస్తానని కేటీఆర్ తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని కందుకూరులో ఏర్పాటు చేసిన రైతు ధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

దిక్కుమాలిన నోటలు, రోత పుట్టించే మాటలు మాట్లాడే ముఖ్యమంత్రిని విడిచిపెట్టం. నీ గబ్బు మాటలకు నీ మంత్రుల చెడ్డ మాటలకు సమాధానం చెబుతాం. ఇక నుంచి వదిలిపెట్టం. నాపై ఆరోపణలు చేసిన మంత్రిపై ఆల్రెడీ పరువు నష్టం దావా వేశాను. ముఖ్యమంత్రి మీద కూడా తొందర్లనే వేస్తా.. అడ్డగోలుగా మాట్లాడిన మంత్రిగారిని విడిపెట్టను, క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టను. అటు క్రిమినల్, ఇటు సివిల్ డిఫమేషన్ రెండు సూట్లు వేస్తాను, వదిలిపెట్టే ప్రసక్తే లేదు. తప్పే చేయనప్పుడు ఎవని అయ్యకు కూడా భయపడం. ఏం చేసుకుంటవో చేస్కో అని మోదీకే చెప్పినం. ఈ చిట్టి నాయుడు ఎంత మనకు అడ్డిమారి గుడ్డి దెబ్బలో

మిగతా 2 లో



## జీహెచ్ఎంసీని 4 కార్పొరేషన్లుగా విభజించనున్నట్లు సమాచారం

**రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి**

హైదరాబాద్, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ని నాలుగు కార్పొరేషన్లుగా విభజించబోతున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంచలన విషయం వెల్లడించారు. ఈ విషయమై శనివారం కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ మహా నగరంలో జనాభా కోటిన్నరకు

మిగతా 2 లో



## మూసి నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**కీలక ప్రకటన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

.. వివరాలు 2లో

## హైడ్రా ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం

హైడ్రాకి చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్‌పై సంతకం



.. వివరాలు 2లో



## సచివాలయ సిబ్బంది బదిలీకి రంగం సిద్ధం

**సెక్షన్ ఆఫీసర్ మొదలు సెక్రెటరీ వరకు బదిలీలకు నిర్ణయం**



## విడుదలైన 18వ విడత కిసాన్ సమ్మాన్ నిధి

**9.4 కోట్ల రైతుల ఖాతాలో పీఎం 20 వేల కోట్ల పంపిణి**

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 18వ విడతను విడుదల చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ మహారాష్ట్ర లోని

మిగతా 2 లో



## చర్చకు "మల్లిగాడు.. ఎల్లిగాడు కాకుండా" కెసిఆర్ రావాలి

కేసీఆర్ ఫామ్‌హౌస్ దగ్గర దీక్ష చేస్తా

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సవాల్

హైదరాబాద్, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): రుణమాఫీపై హరీష్ రావు ఢిల్లీలో ధర్నా చేస్తామని బ్లాక్‌మెయిల్‌చేస్తుండని హరీశ్ ఢిల్లీలో ఫ్లయిట్ దిగే లోపే తాను కేసీఆర్ ఫామ్ హౌజ్ ముందు ధర్నాకు కూర్చుంటానని పీసీసీ వర్కింగ్

మిగతా 2 లో

# డిసెంబర్ 9న పేదలకు ప్రభుత్వ భూములు పంచుతాం

భూమాతతో రైతుకు ఎలాంటి భయం లేకుండా చేస్తాం

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): డిసెంబర్ 9న పేదలకు ప్రభుత్వ భూములు పంచుతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. త్వరలోనే భూమాతను తీసుకువచ్చి భూమి విషయంలో రైతుకు ఎలాంటి భయం లేకుండా చేస్తామని చెప్పారు. ఇవాళ నల్గొండ జిల్లా

మిగతా 2 లో




## అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగుంపు

హైదరాబాద్, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టడీసెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్‌లలో భాగంగా కాంటాక్ట్ తరగతులు, ల్యాబొరేటరీ సెషన్స్, అసైన్‌మెంట్స్, వార్షిక పరీక్షలు ఉంటాయి. ఆలిండియా

మిగతా 2 లో



## కేయు దూరవిద్యలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

**అక్టోబర్ 15 వరకు అవకాశం**

హన్మకొండ, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): ఉమ్మడి వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ దూర విద్యలో డిగ్రీ, పీజీ, డిప్లొమా ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. ముందుగా నిర్ణయించిన

# బతుకమ్మ, మూసీపై ట్వీటర్ వేదికగా ధ్వజమెత్తిన కేటీఆర్

## బతుకమ్మ పండుగను నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం

హైదరాబాద్, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): బతుకమ్మ, మూసీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీటర్ వేదికగా తీవ్రంగా ధ్వజమెత్తారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బతుకమ్మ అంటే గిట్టదా పట్టదా ఈ ముఖ్యమంత్రికి? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల వేడుకకు ఏర్పాట్లు చేయడానికి మనసురావట్లేదా? అని మండిపడ్డారు. పండుగపూట కూడా పల్లెలను పరిశుభ్రంగా వుంచలేరా? అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. చెత్తా చెదారం మధ్య మురికి కంపులో మన అక్కా చెల్లెళ్లు బతుకమ్మ ఆడుకోవాల్నా? అని ట్విట్ చేశారు. బ్లీచింగ్ పౌడర్ కొనడానికి చెరువు కట్టమీద లైట్లు పెట్టడానికి పైసల్లేని పరిస్థితులు దాపురించాయి పంచాయతీల్లో! అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాష్ట్ర పండుగను నిర్వహించుకునేందుకు నిధుల్లేని దౌర్భాగ్యం ఎందుకొచ్చింది? అని ప్రశ్నించారు. తెలంగాణ అస్తిత్వ సంబురంపై ఎందుకింత నిర్లక్ష్యం? అన్నారు. ప్రకృతిని పూజించే విశిష్ట పండుగను స్వచ్ఛమైన పరిసరాల్లో జరుపుకునే భాగ్యం కూడా లేదా మహిళలకు? అని తెలిపారు. బతుకమ్మ చీరెలను రద్దు చేసారు. ఇప్పుడు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా చేసుకోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారా? అని ప్రశ్నించారు. మరోవైపు మూసి వెనక దాక్కున్న ముసుగు దొంగ ఎవరు? అంటూ మరో ట్వీట్ చేశారు కేటీఆర్. రైతు రుణ మాఫీ ఎగ్గొట్టి, మూసి లో మురికి రాజకీయాలు చేస్తున్న మురికి దొంగ ఎవరు? అని ప్రశ్నించారు. రైతు బంధు ఎగ్గొట్టి, మూసి పేదల ఉసురు పోసుకుంటున్న దుర్మార్గుడు ఎవరు? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు వంద రోజుల్లోనే నెలకు 2500 ఇస్తా అని చెప్పి తప్పించుకు తిరుగుతున్న మోసగాడు ఎవరు? అని మండిపడ్డారు. అవ్వ, తాతలకు నెలకు 4000 ఇస్తా అని చెప్పి ఎగ్గొట్టిన నయవంచకుడు ఎవరు? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తా అని మాట తప్పిన దగావీరుడు ఎవరు? .. మూసి బ్యూటిఫికేషన్ పేరిట 1,500,000,000 కోట్ల లూటిఫికేషన్ కి తెరతీసిన ఘనుడు ఎవరు? అని ట్వీటర్ వేదికగా కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**జీహెచ్ఎంసీని 4 కార్పొరేషన్లుగా విభజించనున్నట్లు సమాచారం**

చేరింది. జీహెచ్ఎంసీని నాలుగు కార్పొరేషన్లుగా చేసిన తర్వాత నలుగురు మేయర్లు ఉంటారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నలుగురు మేయర్లను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ నగరాన్ని ప్రపంచ పటంలో ఉంచేందుకు రూ.30వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్)ను నిర్మిస్తాం. అమెరికా తర్వాత అత్యధికంగా ఎంఎన్సీ కంపెనీల హెడ్క్వార్టర్స్ హైదరాబాద్‌లోనే ఉండనున్నాయి అని కోమటిరెడ్డి తెలిపారు.

# నటుడు నాగార్జునపై రేవంత్ రెడ్డి సర్కార్ కక్ష సాధింపు..?

నమోదు చేశారు. తమ్మిడికుంట కబ్జా చేసి ఎన్ కన్వెన్షన్ కట్టారని మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో నాగార్జునపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. జనంకోసం అనే సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్కినేని నాగార్జునపై సీఎం రేవంత్ రెడ్డి కక్ష గట్టినట్లుగా అనిపిస్తుంది. ముందుగా ఎన్ కన్వెన్షన్ సెంటర్ విషయంలో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే హైడ్రా కూల్చివేసింది. కోర్టు నుంచి స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ దానికి విరుద్ధంగా ఎన్ కన్వెన్షన్ కట్టడాలను కూల్చివేయడంపై అప్పట్లో నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. అది పూర్తిగా ప్రైవేటు భూమి అని, అంగుళం కూడా చెరువు భూమిని తాము ఆక్రమించలేదని స్పష్టం చేశారు. ఆ తర్వాత నాగార్జున ఈ విషయంలో సైలెంట్‌గా ఉన్నారు. అయినప్పటికీ రేవంత్ సర్కార్ మాత్రం నాగార్జునను వదల్లేదు. ఇటీవల మంత్రి సురేఖ అక్కినేని కుటుంబం, సమంతపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై ఫిలిం ఇండస్ట్రీ ముక్త కంఠంతో మండిపడింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన నాగార్జున మంత్రి సురేఖపై క్రిమినల్ కేసు పెట్టడంతో పాటు పరువు నష్టం దావా వేశారు. కొండా సురేఖ హద్దులు దాటి మాట్లాడారని దీనిపై క్షమాపణ చెప్పినా కేసు ఉపసంహరించుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. దీంతో ఈ విషయంలో నాగార్జునను సైలెంట్ చేయడానికి బెదిరింపు చర్యల్లో భాగంగా కేసు పెట్టారని అక్కినేని అభిమానులు భావిస్తున్నారు. దీంతో రేవంత్ సర్కార్ తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతున్నది.

# మూసి నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

హైదరాబాద్, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): మూసి నిర్వాసితులను ఆదుకునే అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వారందరినీ ఆదుకుంటుందన్నారు. ఎవరినీ అనాదలను చేయబోమన్నారు. ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చారు సీఎం. అంతేకాదు.. ఎవరైనా వచ్చి రెచ్చగొడితే వారి మాటలను నమ్మొద్దని, వారి ఫామ్ హౌజ్‌లను కాపాడుకోవడానికే డ్రామాలాడుతున్నారని సీఎం విమర్శించారు. శనివారం నాడు కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన మూసీ నిర్వాసితులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. మూసీ నిర్వాసితులు అధైర్యపడొద్దని ప్రత్యామ్నాయం చూపిస్తామన్నారు. మూసీ బాధితులకు అండగా ఉన్నట్లు మాట్లాడే వారంతా పేదలకు ఏం చేద్దామో వారిని ఎలా ఆదుకుందామో చెప్పాలని కోరారు. ఇల్లు ఇద్దామా డబ్బులు ఇద్దామా ప్రభుత్వ స్థలాలు ఇద్దామా అని విపక్ష నేతలను సీఎం ప్రశ్నించారు. హైదరాబాద్ నగరాన్ని నీటి ప్రమాదం నుంచి కాపాడాలని.. ప్రజల మంచి కోసమే ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు సీఎం రేవంత్. మూసీ దగ్గర ఉన్న వాళ్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాళేశ్వరంలో ఒక్క కుటుంబమే లక్ష కోట్లు మింగిందంటూ కేసీఆర్ కుటుంబం టార్గెట్‌గా తీవ్ర ఆరోపణలు చేశారు సీఎం రేవంత్. మూసి బాధితులు అందరిని ఆదుకోవడానికి పట్టుమని రూ. పదివేల కోట్లు కూడా కావన్నారు. పేదల కోసం పదివేల కోట్లు ఖర్చు పెట్టడానికి ప్రభుత్వం వెనుకాడబోదన్నారు.

# సచివాలయ సిబ్బంది బదిలీకి రంగం సిద్ధం



హైదరాబాద్, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): సచివాలయంలో వివిధ శాఖల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న సిబ్బందిని బదిలీ చేయడానికి రంగం సిద్ధమైంది. సాధారణ పరిపాలన (జీఏడీ), ఆర్థికం (ఫైనాన్స్), న్యాయ (లా) విభాగాలు మినహా మిగిలిన అన్ని డిపార్టుమెంట్లలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ మొదలు జాయింట్ సెక్రెటరీ వరకు బదిలీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. దీనికి అనుసరించాల్సిన విధానాలపై జీఏడీ రూపొందించినన నివేదికకు సీఎం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సచివాలయ వర్గాల సమాచారం. ఆ నిర్ణయం ఆధారంగా ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశమున్నది. గడిచిన పదేండ్ల కాలంలో స్వల్ప స్థాయిలో బదిలీలు చోటు చేసుకున్నా లాంగ్ స్టాండింగ్ అనే కోణం ఆలోచించి నిర్ణయం జరగలేదని ఆ వర్గాలు పేర్కొన్నాయి. కానీ ఇప్పుడు మాత్రం 32 విభాగాల్లో దాదాపు 400 మందికి మించి బదిలీ అయ్యే అవకాశమున్నట్లు తెలిపాయి. దీంతో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్రెటరీ, డిప్యూటీ సెక్రెటరీ స్థాయి వరకు పదుల సంఖ్యలో బదిలీలు ఉంటాయని, జాయింట్ సెక్రెటరీ ర్యాంకులో మాత్రం తక్కువ మంది ఉండొచ్చని సూచనప్రాయంగా తెలిపాయి.

**దీర్ఘకాలంగా పని చేస్తున్నందున**

దీర్ఘకాలంగా ఒకే డిపార్టుమెంటులో వీరు పనిచేస్తున్నందున ఇప్పుడు బదిలీ చేయాల్సి వస్తున్నట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వివరించారు. సాధారణంగా ప్రతి సంవత్సరం రొటీన్ పద్ధతిలో ఇలాంటి బదిలీలను పరిపాలనా అవసరాల రీత్యా ప్రభుత్వం చేపట్టాల్సి ఉంటుందని, కానీ 2017, 2018 సంవత్సరాల్లో చాలా తక్కువ సంఖ్యలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి. ఒకే శాఖలో ఎక్కువ కాలంగా వీరు పనిచేస్తుండడంతో తగినంత అనుభవాన్ని సంపాదించినా మిగిలిన సిబ్బందికి అవగాహన కల్పించలేని పరిస్థితి నెలకొన్నదని ప్రభుత్వం భావించింది. ఏదేని పరిస్థితుల్లో అనుభవం ఉన్న సదరు ఉద్యోగి ఆఫీసులో అందుబాటులో లేకపోతే మిగిలిన స్టాఫ్‌తో ఆ పనులు జరగడం లేదనే నిర్ధారణకు వచ్చింది. దీనికి తోడు ఫోకల్, నాన్-ఫోకల్ పోస్టులనే అభిప్రాయంతో ఇతర సిబ్బందికి తగిన అవకాశాలు రావడంలేదని, ఎప్పటికీ వారు అనుభవాన్ని పొందలేని కింది స్థాయిలోనే ఉండిపోతున్నరనే ఫీడ్ బ్యాక్ కూడా అధికారుల ద్వారా ప్రభుత్వానికి వెళ్లింది. కొన్ని సందర్భాల్లో ఐఏఎస్ అధికారులు సైతం సదరు అనుభవమున్న వ్యక్తిపైనే ఆధారపడాల్సి వస్తున్నదని తెలిందిి. ఈ పరిణామాలన్నింటినీ బేరీజు వేసుకున్న ప్రభుత్వం వేర్వేరు డిపార్టుమెంట్లలోకి బదిలీ చేయాలని నిర్ణయించింది.

**ర్యాంకుల వారీగా వివరాలు**

జీఏడీ అధికారులు ఆయా విభాగాల్లో నాలుగేండ్లు, ఆరేండ్లు, పదేండ్లకంటే ఎక్కువ కాలం నుంచి ఎవరెవరు పనిచేస్తున్నారో ర్యాంకులవారీగా వివరాలను సేకరించి ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు తెలిసింది. వీటిని పరిశీలించిన అనంతరం నాలుగేండ్ల కాలాన్ని ప్రామాణికంగా తీసుకున్న ప్రభుత్వం సింగిల్ యూనిట్ సిస్టమ్ పద్ధతిలో బదిలీలు చేపట్టాలనే నిర్ణయానికి వచ్చింది. ఆ ప్రకారం ఫైనాన్స్, జీఏడీ, లా డిపార్టుమెంట్లు మినహా మిగిలిన అన్ని విభాగాల్లో బదిలీలు చేపట్టేలా నిర్ణయం జరిగింది. ఈ లెక్కల ప్రకారం అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ర్యాంకులో సుమారు 150 మంది (ఇందులో దాదాపు పాతిక మంది ఆరేండ్లకు పైగా పనిచేస్తుండగా, మరో ఇరవై మంది పదేండ్లకు మించి పనిచేస్తున్నారు) బదిలీ కానున్నట్లు ఆ వర్గాల ద్వారా తెలిసింది. సెక్షన్ ఆఫీసర్ ర్యాంకులో మరో 150 మంది, అసిస్టెంట్ సెక్రటరీ స్థాయిలో దాదాపు యాభై మంది, డిప్యూటీ సెక్రెటరీ లెవల్‌లో దాదాపు ఇరవై మంది ఉంటారని పేర్కొన్నాయి.

# ఎన్ని సార్లు చెప్పాలి..



**మొదటి పేజీ తరువాయి**

అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది సుప్రీంకోర్టు ధర్మాసనం. అయితే ఈ ఆదేశాలను ఇప్పటి వరకు కొన్ని రాష్ట్రాలు మాత్రమే పాటించాయి. మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు వలస కార్మికులు రేషన్ కార్డులను ఇవ్వలేదు. దీని మీద న్యాయస్థనం ఇప్పటికే పలుసార్లు చెప్పింది. ఈసరి మరోసారి ఈ విషయం మీద విచారణ చేసిన సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఎన్నిసార్లు చెప్పాలి అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందులో అంత ఉదాసీనంగా ఉడడనికి ఏముంది ఎందుకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు చేడం లేదంటూ వ్యాఖ్యానించింది. ఈ అంశంలో ఎలాంటి ఉదాసీనతకు చోటు లేదని స్పష్టం చేసింది. ఇక తమకు ఓపిక నశించిందని అందుకే మా ఉత్తర్వులను పాటించేందుకు మీకు చివరి అవకాశం ఇస్తున్నట్లు తెలిపింది. లేదంటే మీ కార్యదర్శులు కోర్టుకు రావాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది. ఈ వ్యవహారంపై నవంబరు 19లోగా కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తగిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# సీఎం రేవంత్ రెడ్డిపై పరువు నష్టం దావా వేస్తా

**మొదటి పేజీ తరువాయి**

సీఎం అయిండు. ఇక ఆగుతలేదు. పెద్దోని అయిపోయానని రేవంత్ రెడ్డి అనుకుంటున్నాడు అని కేటీఆర్ మండిపడ్డారు. సబితక్క ముగ్గురు కొడుకులకు ఫామ్ హౌస్‌లు ఉన్నాయట. మరి అవి ఎక్కడున్నాయో చెబితే మేమే కూలగొడుతాం. సబితక్క బిడ్డకు కూడా ఉందట. అది కూడా చూపిస్తే కూలగొడుతాం. మాట్లాడితే కూలగొడుతా అంటున్నావ్ అది నీ ఇష్టం. రేవంత్ రెడ్డి నీ కళ్లు చల్లబడుతాయి అనుకుంటే మావి కూలగొట్టి అక్కడికి ఆపేయ్. పేదవాళ్లవి మాత్రం కూలగొట్టకు.. వారి ఇండ్లను ముట్టుకోవడం బంద్ చేయ్. ఇవాళ రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే బాధ అనిపిస్తుంది. ఒక దిక్కేమో రైతు గోస హైదరాబాద్ పోతే మూసీ బాధితుల రోదన. మూసీ పరివాహక ప్రాంతంలో 50 ఏండ్ల నుంచి ఇల్లు కట్టుకుంటే ఆక్రమణదారులు, కబ్జాదారులు అంటున్నాడు రేవంత్ రెడ్డి. మీ కాంగ్రెస్ ప్రభుత్వమే రిజిస్ట్రేషన్లు చేసే ఇన్ని రోజులు పైసలు దొబ్బితింటివి. ఇప్పుడేమో కబ్జాకోరులు అని మాట్లాడుతున్నావు. నీకు చిత్తశుద్ధి ఉంటే కొడంగల్‌లోని రెడ్డి కుంటలో నీ సొంత ఇల్లు ఉంది. దమ్ముంటే దాన్ని కూలగొట్టి పేదోళ్ల వద్దకు రా అని సవాల్ చేస్తున్నా. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న మీ అన్న తిరుపతి రెడ్డి ఇల్లు కూలగొట్టు. అప్పటికీ కడుపు మంట చల్లారకంటే మావి కూలగొట్టు కానీ పేదల ఇండ్ల వద్దకు రావొద్దని కేటీఆర్ చెప్పారు.

# చర్చకు "మల్లిగాడు.. ఎల్లిగాడు కాకుండా" కెసిఆర్ రావాలి



**మొదటి పేజీ తరువాయి**

ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సవాల్‌విసిరారు. పదేళ్లు రైతులను మోసం చేసిన కేసీఆర్ ఫామ్‌హౌస్‌దగ్గర దీక్ష చేస్తానని రాసిపెట్టుకోమని మాజీ మంత్రిపై ఫైర్ అయ్యాడు. హరీశ్ దొంగ దీక్షలను ప్రజలు నమ్మేపరిస్థితి లేరన్నారు. కేసీఆర్‌కుటుంబానికి రాహుల్ గాంధీ ఇంటి ముందు ధర్నా చేసే హక్కు లేదన్నారు.ఇవాళ ( అక్టోబర్ 5, 2024 ) గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ రుణమాఫీ కోసం ఆగస్టులో ప్రభుత్వం రూ. 18 వేల కోట్లను మంజూరు చేసిందని తెలిపారు. రుణమాఫీ కోసం ఇంకో రూ. 12 వేల కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. చిన్న చిన్న సమస్యలతో రుణమాఫీ ఆగింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎనిమిది కిస్తీల్లో లక్ష రూపాయలు కూడా రుణమాఫీ చేయలేకపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే మేం రుణమాఫీ చేశాం. దీనిపై చర్చకు నేను సిద్ధం. రుణమాఫీపై చర్చకు మల్లిగాడు, ఎల్లిగాడు కాకుండా కేసీఆర్ రావాలి. కేసీఆర్‌ను ఒప్పించి చర్చకు తీసుకువచ్చే కెపాసిటీ హరీశ్‌రావు కు ఉందా. కేసీఆర్ ను హరీశ్‌రావు చర్చకు తీసుకువస్తే సీఎంను ఒప్పించి తీసుకువస్త. మాతో చర్చకు మీకు భయంగా ఉంటే సిద్దిపేటలోనే చర్చ పెట్టిండి.. మేము సిద్ధమే రుణమాఫీ విషయంలో పబ్లిసిటీ చేయడంలో మేము ఫేయిల్ అయ్యాం. కానీ, బీఆర్ఎస్ మాత్రం పబ్లిసిటీలో పాస్ అయ్యింది అని జగ్గారెడ్డి అన్నారు.

# కేయు దూరవిద్యలో ప్రవేశాలకు గడువు పొడిగింపు




**మొదటి పేజీ తరువాయి**

షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 30వ తేదీతో దరఖాస్తుల గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో అధికారులు గడువు పెంచుతూ ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 15వ తేదీ వరకు అప్లయ్ చేసుకోవచ్చని తెలిపారు. http://sdl-ceku.co.in/ వెబ్ సైట్ లోకి వెళ్లి పూర్తి వివరాలను తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

**ముఖ్య వివరాలు:**

డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎల్ఐసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
ఇక పీజీలో చూస్తే తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సోషయాలజీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జువాలజీతో పాటు మరికొన్ని కోర్సులు ఉన్నాయి.
2024-25 విద్యా సంవత్సరానికి దూరవిద్య విధానంలో యూజీ/ పీజీ/ డిప్లొమా/ సర్టిఫికేట్ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారు.
సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్ లైన్ ఎడ్యుకేషన్, కాకతీయ వర్సిటీ వెబ్ సైట్ లోకి వెళ్లి అప్లికేషన్ ప్రాసెస్ చేసుకోవచ్చు.
యూజీ కోర్సులు మూడేళ్లు ఉంటాయి. పీజీ రెండేళ్లు, డిప్లొమా కోర్సుల వ్యవధి ఏడాదిగా ఉంటుంది.
యూజీ, పీజీ కోర్సుల్లో సెమిస్టర్ విధానం ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలోనే స్టడీ సెంటర్ ను ఎంచుకోవాలి.
పూర్తి చేసిన దరఖాస్తులను వరంగల్ లో ఉన్న స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ లెర్నింగ్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్, కాకతీయ వర్సిటీ కేంద్రంలో సమర్పించాలి.
కోర్సు ఫీజును ఆన్ లైన్ లో లేదా ఆఫ్ లైన్ లోనైనా చెల్లించవచ్చు.
ఈసారి మొత్తం 33 కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు - 0870 - 2461480, 0870 - 2461490.
దరఖాస్తులకు తుది గడువు: 15 అక్టోబర్, 2024.
దరఖాస్తు ఫారమ్ డౌన్లోడ్ లింక్ - http://sdlceku.co.in/UG-PG-Notification.php
అధికారిక వెబ్ సైట్ - http://sdl-ceku.co.in/index.php
మెయిల్ info@sdlceku.co.in
%డిగ్రీ అప్లికేషన్ ఫామ్ PDF డౌన్లోడ్ లింక్ - http://sdlceku.co.in/pdf/UG-2024.pdf
పీజీ అప్లికేషన్ ఫామ్ PDF డౌన్లోడ్ లింక్ - http://sdlceku.co.in/pdf/PG-2024.pdf
%మరోవైపు ఓయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ తో పాటు అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో కూడా అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. అర్హులైన అభ్యర్థులు డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో దరఖాస్తుల గడువు అక్టోబర్ 15వ తేదీ వరకు పొడిగించారు.

# విడుదలైన 18వ విడత కిసాన్ సమ్మాన్ నిధి

**మొదటి పేజీ తరువాయి**



వాషిమ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 9.4 కోట్ల మంది రైతుల ఖాతాలో పీఎం 20 వేల కోట్లను పంపిణి చేశారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా 20,000 కోట్లను జమ చేశారు. వెబ్‌కాస్ట్ ద్వారా దేశవ్యాప్తంగా 732 కృషి విజ్ఞాన కేంద్రాలు, 1 లక్షకు పైగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు మరియు 5 లక్షల కామన్ సర్వీస్ సెంటర్‌లతో సహా దాదాపు 2.5 కోట్ల మంది రైతులు ఈ కార్యక్రమంలో చేరారు. రైతులను ఆదుకోవడానికి మరియు ప్రత్యక్ష ఆర్థిక సహాయం ద్వారా వారి జీవనోపాధిని పెంచడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ఒకటి. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని 24 ఫిబ్రవరి 2019న ప్రారంభించారు. భూమిని కలిగి ఉన్న రైతులకు మూడు సమాన వాయిదాలలో సంవత్సరానికి రూ. 6,000 అందిస్తుంది. అందులో భాగంగానే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 18వ విడతను అక్టోబర్ 5న ప్రధాన మంత్రి విడుదల చేశారు. 18వ విడత విడుదలతో ఈ పథకం కింద మొత్తం పంపిణీ రూ. 3.45 లక్షల కోట్లు దాటుతుంది. దేశవ్యాప్తంగా 11 కోట్ల మందికి పైగా రైతులకు మద్దతునిస్తుంది. ఈ పథకం ద్వారా గ్రామీణాభివృద్ధి మరియు వ్యవసాయ శ్రేయస్సు కోసం ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. మహారాష్ట్రలో ఈ పథకం 17 విడతల్లో సుమారు 1.20 కోట్ల మంది రైతులకు సుమారు రూ. 32,000 కోట్లు బదిలీ చేయబడ్డాయి.

# హైడ్రా ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం

హైదరాబాద్, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): హైడ్రా ఆర్డినెన్స్ కు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. హైడ్రాకి చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్‌పై సంతకం చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన హైడ్రా ఆర్డినెన్సుకు గవర్నర్ ఆమోదం తెలపడంతో తక్షణం అమల్లోకి వచ్చింది. హైడ్రాకు చట్టబద్ధత లేదంటూ విపక్షాల నేతలు విమర్శలు చేస్తుండడం, హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేస్తున్న సమయంలోనే ప్రభుత్వ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలపడం విశేషం. ఇప్పటికే కూల్చివేతలపై దాఖలైన వేర్వేరు పిటిషన్లపై జరిగిన విచారణల్లో వివరణ ఇవ్వాలంటూ హైడ్రా కమిషనర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే నోటీసులు జారీ అయ్యాయి. తదుపరి విచారణ ఈ నెల 14న జరగనున్నందున ఆర్డినెన్సు విషయమై హైకోర్టుకు అడ్వొకేట్ జనరల్ వివరించే అవకాశమున్నది. ఈ సమయంలో హైడ్రాకు చట్టబద్ధత కల్పించడంతో గెజిట్ విడుదలైన తేదీ నుంచే హైడ్రా ఉనికిలో ఉన్నట్లయింది.

# డిసెంబర్ 9న పేదలకు ప్రభుత్వ భూములు పంచుతాం

**మొదటి పేజీ తరువాయి**

తిరుమలగిరి సాగర్ మండలం నెల్లికల్ గ్రామంలో నిర్వహించిన భూమాత సర్వే పైలెట్ ప్రాజెక్టు స్కీమ్‌లో భాగంగా మాజీ సీఎల్పీ లీడర్ కుందూరు జానారెడ్డి, నాగార్జునసాగర్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నిరుపేదల జీవితాల్లో మార్పు కోసం రాష్ట్రంలో ఇందిరమ్మ అమలు చేస్తామని చెప్పారు. తిరుమలగిరి సాగర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశాం. ఇక్కడి రైతుల సమస్యలను పరిష్కారించి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తం. ధరణి పోర్టల్‌తో బీఆర్ ఎస్ ప్రభుత్వం ఆటలు ఆడింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణినీ బంగాళా ఖాతంలో వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో చెప్పారు. త్వరలోనే ప్రజలకు అనువైన ఆర్ఓఆర్ చట్టం అమలు చేస్తం. ఈ చట్టాల విషయంలో ప్రతిపక్ష పార్టీల సలహాలు సూచనలు స్వీకరిస్తాం. గత ప్రభుత్వ తప్పిదలా వల్ల భూమి లేకున్నా పాస్ బుక్‌లు సృష్టించి రైతు బంధు తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిజమైన రైతులకు లబ్ధి జరుగుతుంది' అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

నాగార్జున సాగర్ నియోజక వర్గానికి 5 వేల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, ఇందిరమ్మ రాజ్యంలో పేదలను ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. తిరుమలగిరి సాగర్ మండలంలో 4300ఎకరాల్లో 1300 మంది రైతులకు పట్టాలు ఉన్న భూమి లేదని ప్రభుత్వ గుర్తించిందన్నారు. అటవీ భూములు అధికంగా ఉన్నాయని, అసలు రైతులకు న్యాయం జరగడం లేదనే విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. ఫారెస్ట్, రెవెన్యూ శాఖల మధ్య వివాదం ఉన్న భూముల సమస్యలు పరిష్కారం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగుంపు

**మొదటి పేజీ తరువాయి**

రేడియో ద్వారా నిర్ణీత సమయాల్లో రేడియో పాఠాలు ప్రసారం చేస్తారు. డిగ్రీ ప్రోగ్రామ్‌లలో రెండు, మూడు సంవత్సరాలుబీ పీజీలో రెండో సంవత్సరం చదువుతున్నవారుబీ ఓల్డ్ బ్యాచ్ స్టూడెంట్స్ కూడా తమ ట్యూషన్ ఫీజులు చెల్లించవచ్చు.

**అర్హత:**

బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్ (సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. పీజీ కోర్సులకు ద్వితీయ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ /బీబీఎం/ బీఏ (కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ (మేథమెటిక్స్/ అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కాగా ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ అక్టోబరు 15గా సూచించారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## ఈషా ఫౌండేషన్ లో ఏం జరుగుతోంది

తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్ లకు వచ్చేయడంతో సంచలనంగా మారింది. ఇటీవల సద్గురు వాసుదేవ్ పై చెన్నై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. " జగ్గీ వాసుదేవ్ తన కుమార్తెకు వివాహం చేశారు. జీవితంలో బాగా స్థిరపడేలా సంపాదించారు. కానీ ఇతర మహిళల తమ భౌతిక జీవితాన్ని త్యాగం చేయాలని చెబుతున్నారు. ఇలా ఆయన ఎందుకు చేస్తున్నారు" జగ్గీ వాసుదేవ్ ను ఉద్దేశించి తమిళనాడు హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ఇవి. జగ్గీ వాసుదేవ్ మనదేశంలో గాడ్ మ్యాన్ స్టేటస్ అనుభవిస్తున్నాడు. అలాంటి వ్యక్తిపై హైకోర్టు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఒకరకంగా సంచలనమే అని చెప్పాలి. జగ్గీ వాసుదేవ్ ఇద్దరు మహిళలను నిర్బంధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దానిపై చెన్నై హైకోర్టులో విచారణ జరుగుతుంది. ఈ విచారణ క్రమంలోనే హైకోర్టు వాసుదేవ్ పై సంచలన వ్యాఖ్యలు చేసింది.ఈ సమయంలో పోలీసులు ఈశా ఫౌండేషన్ కార్యాలయంలో తనిఖీలు మొదలుపెట్టారు.. వాస్తవానికి వాసుదేవ్ వివాదాలు ఎదుర్కోవడం కొత్త కాదు. ఆయన భార్య మరణించిన తీరు ఇప్పటికీ ఒక వివాదంగానే ఉంది. పర్యావరణం గురించి పదే పదే చెప్పే జగ్గీ వాసుదేవ్.. పర్యావరణ నిబంధనలు పట్టించుకోకుండానే ఈషా ఫౌండేషన్ భవనాలను నిర్మించాడనే విమర్శలు ఉన్నాయి. ఇక ఈషా ఫౌండేషన్ కార్యాలయంలో కొంతమంది మహిళలు అపహరణకు గురయ్యారని స్వయంగా తమిళనాడు పోలీసులు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లిన సంఘటనలో చాలా ఉన్నాయి. 2022లో జగ్గీ వాసుదేవ్ సేవ్ సాయిల్ అనే నినాదంతో 27 దేశాల్లో 30 వేల కిలోమీటర్ల యాత్ర చేశారు. భారతదేశానికి తిరిగివచ్చారు. ఓ ప్రైవేట్ ఛానల్ ఆయనను ఇంటర్వ్యూ చేసింది. సేవ్ సాయిల్ పేరుతో మీరు చేస్తున్న యాత్ర బాగుందని చెప్పిన ఆ టీవీ ఛానల్.. ఎటువంటి పర్యావరణ అనుమతులు లేకుండానే మీరు ఈషా ఫౌండేషన్ భవనాలు ఎందుకు నిర్మించాలని ప్రశ్నించింది. ఆ ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పకపోగా.. దేశంలో చట్టాలు లేవా అంటూ వ్యాఖ్యానించారు. అనంతరం ఆ టీవీ ఛానల్ విలేఖరి మరో ప్రశ్న వేయగా.. ష్ అంటూ సద్గురు చిరాకును వ్యక్తం చేశారు. ఈషా ఫౌండేషన్ కార్యాలయంలో ఆరుగురు మహిళలు అదృశ్యం అయ్యారట. 2016 తర్వాత ఆ మహిళను కనిపించడం లేదని తమిళనాడు పోలీసులు హైకోర్టుకు విన్నవించారు. గత ఏడాది మార్చిలో తన సోదరుడు 46 సంవత్సరాల గణేషన్ ఈషా ఫౌండేషన్ కార్యాలయం నుంచి కనిపించకుండా వెళ్లాడని తిరుమలై అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టు ఆదేశాలతో పోలీసులు విచారణ నిర్వహించగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది.జగ్గీ వాసుదేవ్ తన యూట్యూబ్ వీడియోల ద్వారా రకరకాల విషయాలను చెబుతుంటారు. ఇటీవల గ్రహణానికి సంబంధించి ఒక విషయాన్ని వెల్లడించారు. చంద్రగ్రహణం సమయంలో ఆహారం కలుషితమవుతుందని ఆయన చెప్పడం సంచలనంగా మారింది. జగ్గీ వాసుదేవ్ భార్యా మరణం విషయంలోనూ అనేక సందేహాలు ఉన్నాయి. వాసుదేవ్ భార్య 997 జనవరి 23న చనిపోయారు. అయితే ఆయన తన భార్య మరణాన్ని మహా సమాధిగా పేర్కొన్నారు. మహా సమాధి అంటే ఒక వ్యక్తి తనకు తానుగా శరీరాన్ని విడిచిపెట్టే విధానం. అయితే మన దేశంలో మహా సమాధి పొందిన వ్యక్తిని ఎవరూ దానం చేయలేదు. ఒకవేళ మహా సమాధి ఒక వ్యక్తి పొందితే.. ఆ వ్యక్తిని సమాధి మాత్రమే చేస్తారు.. గతంలో కల్కి భగవాన్ ఆశ్రమంలోనూ ఇలాంటి ఘటనలే చోటు చేసుకున్నాయి. అప్పట్లో ఆశ్రమంలో ఉన్నవారు పోలీసులు తనిఖీలు చేసినప్పుడు ఇలాంటి సమాధానాలు చెప్పారు. చూడబోతే ఈషా ఫౌండేషన్ కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలు సంచలనంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఫౌండేషన్ కార్యాలయంలో రకరకాల యోగాలు, ఇతర అభ్యసన ప్రక్రియల గురించి మాత్రమే చెబుతున్నారని అక్కడ ఉండే వారు అంటున్నారు. అయితే అక్కడ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్నాయని కొంతమంది ఆరోపిస్తున్నారు. హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో తమిళనాడు పోలీసులు అక్కడ సోదాలు చేస్తున్నారు. ఒకవేళ పోలీసులు అనుకున్నట్టుగా అక్కడ ఏదైనా దొరికితే.. జగ్గీ వాసుదేవ్ పై కచ్చితంగా చర్యలు ఉంటాయని ప్రచారం జరుగుతున్నది.అయితే సద్గురు తన భార్య కంటే భారతీ అనే మహిళతోనే ఎక్కువసేపు ఉండేవారట. ఈ విషయాన్ని అరుంధతి సుబ్రహ్మణ్యం అనే మహిళ సద్గురు మోర్ దెన్ లైఫ్ అనే పుస్తకంలో రాశారు. ఇక ఈషా ఫౌండేషన్ వెబ్ సైట్ లో అనేక వస్తువులను విక్రయిస్తుంటారు. అయితే అవి అత్యంత ఖరీదుగా ఉంటాయి. జగ్గీ వాసుదేవ్ పాదాల ఫోటో ఫ్రేమ్ 3200 అంటే.. ఆ వెబ్సైట్ ఆధారంగా ఏం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. అక్కడ ఒక రుద్రాక్ష ఖరీదు 10,000 దాకా ఉంటుంది. జగ్గీ వాసుదేవ్ తన కుమార్తెకు వివాహం చేశారు. కానీ చాలామంది యువతలను సన్యాసం తీసుకోవాలని ప్రోత్సహించారు.. ఇదే విషయాన్ని మద్రాస్ హైకోర్టు ప్రముఖంగా ప్రస్తావించింది..

# ఈ నెల 10లోపు ఎకో సెన్సిటివ్ జోన్ నివేదికలు సమర్పించాలి

### అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు



ములుగు జిల్లా, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): ఏటూరునాగారం ఎకో సెన్సిటివ్ జోన్ పరిదికి సంబంధించిన నివేదికలు ఈ నెల 10వ తారీకు లోపు సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., డిఎఫ్ ఓ రాహుల్ కిషన్ జాదవ్ తొ కలసి ఏటూరునాగారం కు సంబంధించి ఎకో సెన్సిటివ్ జోన్ పరిది నిర్ధారించడానికి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన్య ప్రాణి విభాగం ఏటూరునాగారంకు సంబంధించి ఎకో సెన్సిటివ్ జోన్ పరిది నిర్ధారించడానికి సంబంధిత శాఖల అధికారులు ఈ నెల 10వ తారీకు వరకు పూర్తి వివరాలరో కూడిన నివేదిక సమర్పించవలసింధిగా దిశ నిర్ధేశం చేసినారు. అనంతరం ఎకో సెన్సిటివ్ జోన్ కు సంబంధించిన నోటిఫికేషన్ తయారు చేసి ప్రభుత్వానికి పంపడం జరుగుతుందనిహొతెలిపినారు. ప్రకృతి సంపదను పరిరక్షిస్తూ, పర్యాటకులను ఆకర్షించేందుకు ఎకో టూరిజం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందని, పర్యావరణ హితం, సంరక్షణలో భాగంగా ఎకో టూరిజం పర్యాటక ప్రాంతాల్లో కొత్త ఆశలను నింపుతోందని, పర్యాటకులకు సహజమైన అరణ్యాలు, పచ్చని చెట్ల వృక్షాలు, జలపాతాలు, కొండలు వంటి ప్రదేశాలు ముఖ్య ఆకర్షణగా నిలుస్తున్నాయని అన్నారు. ఎకో టూరిజం పర్యాటకులను ప్రకృతికి దగ్గర చేస్తూ, పర్యావరణాన్ని రక్షించే దిశగా కొత్త మార్గాలను ప్రసరించడమే లక్ష్యంగా పని చేస్తోందని, పర్యాటకులు ఈ ప్రాంతాలలో ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు అవగాహనతో కూడిన పర్యటనలు చేయడం వల్ల సాంప్రదాయ జీవన విధానాలను కూడా గౌరవించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఎఫ్డిఓ వజ్రారెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ వెంకటేష్, ఇర్రిగేషన్ ఈ ఈ నారాయణ, జగదీష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ మైన్స్ జయరాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరాలపై పోలీస్, ఎక్సయిస్ అధికారుల దాడులు

### - 1500 లీటర్ల షుగర్ పానకం ధ్వంసం.. 35.లీ గుడుంబా సీజ్







శాయంపేట, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లా శాయంపేట మండలం సూర్యనాయక్ తండా, గంగిరెణిగూడెంలోని గుడుం బా స్తావరాలపై పరకాల ఏసీపీ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్, ఎక్సయిస్ అధికారులు పెద్ద ఎత్తున దాడులు నిర్వహించి (1500) లీటర్ల షుగర్ పానకంను ధ్వంసం చేసి, (35) లీటర్ల గుడుంబా, (10) కేజీల ఈస్ట్ పౌడర్ లను సీజ్ చేసి ఏడుగురు వ్యక్తుల పై కేసులు నమోదు చేయడం జరిగింది. అనంతరం గుడుంబా అనర్ధాలపై తండా వాసులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ దాడులలో కిషోర్ కుమార్ ఏసీపీ పరకాల, రంజిత్ రావు సీఐ శాయంపేట, క్రాంతికుమార్ సీఐ పరకాల, సంతోష్ సీఐ ఆత్మకూర్, తాతాజీ ఎక్సయిస్ సీఐ పరకాల, రమేష్ చందర్ ఎక్సయిస్ టాస్క్ ఫోర్స్ సీఐ, అశోక్ ఎస్ఐ దామెర, ప్రమోద్ కుమార్ ఎస్ఐ శాయంపేట, రమేష్ ఎస్ఐ పరకాల, సృజన్ ప్రోబషనరీ ఎస్ఐ ఆత్మకూర్, ఎక్సయిస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధికి గుడిసే వాసులం అడ్డంకి కాదు

### తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ఇంటి స్థలంతో ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి




ములుగు, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా అభివృద్ధికి గుడిసే వాసులం అడ్డంకి కాదు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వమే ఇంటి స్థలంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వాలి. ధర్నాను ఉద్దేశించి మాట్లాడిన దళిత రత్న అవార్డు గ్రహీత భారత దేశ పీడిత ప్రజల దిక్సూచి మంద కృష్ణమాదిగ ఉద్యమాల కార్యకర్త నెమలి నర్సయ్యమాదిగ మాట్లాడుతూ శనివారం ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ములుగు మండలం ఇంచెర్ల గ్రామపంచాయతీ పరిధిలో అంబేద్కర్ నగర్ గ్రామం వెలిసి 9 సంవత్సరాలు కావస్తున్న వందలాది మంది పేదలు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్నటువంటి పేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని వారందరికీ ఇంటి స్థలం కేటాయిస్తూ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ములుగు జిల్లా అభివృద్ధికి మహాజన పేదలు అడ్డంకి కాదని తెలిపారు. ప్రభుత్వం ఓ వైపు పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు తెలంగాణ ఉద్యమకారులకు మరియు మహాజన పేదలకు ప్రభుత్వమే ఇంటి స్థలాలు ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత కాలయాపన తో తాత్సారం చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంచర్ల గ్రామపంచాయతీ శివారులోని అంబేద్కర్ నగర్ లో గత కొన్ని సంవత్సరాల క్రితం దళితులకు ఇందిరమ్మ ప్రధానిగా ఉన్నప్పుడు ఇల్లు నిర్మించిన సాక్షాలు నేటికీ ఉన్నాయని అట్టి ఇళ్ల స్థానం లోనే మళ్లీ మహాజన గుడిసే వాసులు అందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తూ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఏమాత్రం పేదలకు విరుద్ధంగా ఏ నిర్ణయం తీసుకున్నా పేదల రక్తబొట్టు సాక్షిగా అంబేద్కర్ నగర్ మహాజన గుడిసె వాసుల సంఘం మృతుల సాక్షిగా గుడిసే వాసులకు పట్టాలు సాధించుకుంటామని ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో మహాజన గురుషవాసుల సంఘం ఆర్గనైజింగ్ కన్వీనర్ నాంపల్లి నాగరాజుమహాజన్ కమిటీచైర్మన్ దండబోయిన కుమార్ యాదవ్ మహిళా అధ్యక్షురాలు ఆకుల రజిత, రేపాకుల మమత, పారునంధుల నర్సయ్య మాదిగ, సంకటి సాంబయ్య బలుగూరి భద్రయ్యమాదిగ వందలాది మంది పేదలు పాల్గొన్నారు.

# ప్రజల గుమ్మం వద్దకు న్యాయసేవను తీసుకెళ్లాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): పారా లీగల్ వాలంటీర్లు తమయొక్క పరిమితులకు లోబడి న్యాయసేవను ప్రజల గుమ్మంవద్దకు తీసుకెళ్లాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి. నారాయణ బాబు అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పారా లీగల్ వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజలకు న్యాయ సేవను అందించాలనే ఉద్దేశంతో పారా లీగల్ వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఉచిత, సమాన మరియు సత్వర న్యాయం అందించడంలో వాలంటీర్ల పాత్ర ముఖ్యమైనదని జడ్జి అన్నారు. ఎటువంటి విషయాన్నైనా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకు రావాలని జడ్జి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి, వివిధ మండలాల నుండి పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# డీఎస్సీ 2023 సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి


ములుగు, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): 2023 డీఎస్సీ ఫలితాల అనంతరం 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఒకటి నుండి 5వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉండగా సర్టిఫికెట్ల పరిశీలన ములుగు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు మరియు బాలికల పాఠశాల యందు ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా ఐదవ తారీకు వరకు మొత్తం 433 అభ్యర్థుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయడం జరిగింది. వెరిఫికేషన్ పూర్తి చేసిన అభ్యర్థుల ఫామ్స్ వెంటనే ఆన్లైన్ లో సబ్మిట్ చేయబడింది అని డీఈవో ములుగు తెలిపారు.

# కలెక్టరేట్లో ఘనంగా వెంకటస్వామి జయంతి వేడుకలు



ములుగు జిల్లా, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్ కార్యాలయంలో అధికారికంగా కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి, కలెక్టరేట్ ఏ ఓ రాజ్ కుమార్, డిడబ్లు ఓ ఇంచార్జి శిరీష, డిపిఆర్ఓ రఫిక్, కలెక్టరేట్ పర్యవేక్షకులు మహేష్ బాబు తదితరులు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా ప్రాతినిధ్యం వహించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు.

# ఘనంగా స్వర్గీయ గడ్డం వెంకటస్వామి జయంతి



మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): స్వర్గీయ గడ్డం వెంకటస్వామి, (కాక 95 వ జయంతి ) కార్యక్రమం శనివారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జరిగింది. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆయన చిత్రా పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటు సభ్యులు, కేంద్ర, రాష్ట్ర, మంత్రిగా ఎమ్మెల్సీ,ఎమ్మెల్యే, పెద, బడుగు బలహీనర్గాలు, అందరికీ సేవలందించారనీ తెలిపారు. ఈ జయంతి కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, డిసిఓ వెంకటేశ్వర్లు, డిడి గ్రౌండ్ వాటర్ సురేష్, డిహెచ్ఓ మరియన్న, డిఎఓ విజయ నిర్మల, కలెక్టరేట్ పర్యవేక్షకులు బాలకిషన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డీజే ఆపరేటర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించండి



### - డీజే ఆపరేటర్ల నిర్వాహకులు తహసిల్దార్ కు వినతి

ఆత్మకూర్, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ఇటీవల డీజే నిషేధించడంపై వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం డీజే నిర్వాహకులు డీజే ఆపరేటర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ఆత్మకూరు మండల తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీజే నిర్వాహకులు మాట్లాడుతూ గతంలో ఎస్టీ వాళ్లకు చూపించిన విధంగా డీజే ఆపరేటర్లను కూడా ఆదుకోవాలని ప్రభుత్వమిచ్చే ఉపాధి అవకాశాలతో వీళ్ళను భాగ్యస్వామ్యం చేయాలని వారి కోరారు. ఇట్టి కార్యక్రమంలో డీజే నిర్వాహకులు మహేష్ అరుణ్, అప్పు, సురేష్ ,శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటస్వామి జీవితం ఎంతో మందికి ఆదర్శప్రాయం

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): వెంకటస్వామి నిస్వార్థంగా ప్రజా సేవకు అంకితమై తన రాజకీయ జీవితంలో ఎంతో మందికి ఆదర్శప్రాయంగా నిలిచారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో వెంకటస్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెంకటస్వామి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్గీయ జి వెంకటస్వామి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారకంగా నిర్వహించుటకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటస్వామి సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను నేటి తరాలకు అస్త్రశమని తెలిపారు. స్వర్గీయ జి వెంకటస్వామి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో వివిధ శాఖల మంత్రిగా పని చేశారని, ప్రజలకు విశేష సేవలు అందించారని ఆయన త్యాగం, అంకితభావం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, పశు సంవర్ధక శాఖ అధికారి డా కుమారస్వామి, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కుసుమ కుమారి, కలెక్టరేట్ ఏఓ ఖాజా అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# శాకాంబరీ దేవి అవతారంలో అమ్మవారు

### - ఘనంగా మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం
### - అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో సీఐ, మున్సిపల్ కమిషనర్





పరకాల, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లా పరకాల పట్టణంలోని కనకదుర్గమ్మ, మదన పోచమ్మ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 3 వ రోజు శాకాంబరీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం పరకాల సీఐ క్రాంతి కుమార్,మున్సిపల్ కమిషనర్ నర్సింహ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండి సారంగపాణి, దేవునూరి మేఘనాథ్, నాగెల్లి రంజిత్, ఇంగిలి వీరేష్ రావు, మూసినిపల్లి శివ ప్రసాద్, కంచం రవి, నిఖిల్, సాయి, రాకేష్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



సంగెం, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం హన్మకొండ జిల్లా సంగెం మండలం ఏల్గూర్ రంగంపేట చెరువులో ముదిరాజ్ కులస్తులు గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి చేప పిల్లలను చెరువులో వదిలారు. ఈ సందర్భంగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒక పండుగలా జరుపుతున్నదని అన్నారు. ముదిరాజ్ కులస్తులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోవడానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. గత పాలకులు ప్రచార ఆర్భాటం తప్ప మత్స్యకారులను ఆదుకున్నది ఏమీ లేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్య చరణతో చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ మత్స్యకారుల సంక్షేమానికి పాటుపడుతున్నాదని అన్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువులో చేపలను పెంచడానికి చేప పిల్లలను ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో పంపిణీ చేస్తున్నదని అన్నారు. అధిక మొత్తంలో చేపలు పెంపకం చేయడానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో చేప పిల్లలను పంపించడం జరుగుతుందని అన్నారు. మత్స్యకారులు ప్రత్యేక శ్రద్ధతో చెరువులలో కుంటలలో చేపల పెంపకం చేయాలని, పెరిగిన చేపలను అమ్మకం చేసి మత్స్యకారులు ఆర్థికంగా బలోపితం కావాలని కోరారు. చేపల వేట కోసం వెళ్లిన మృత్యువాత పడిన మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటున్నదని అన్నారు.

# ఘనంగా బతుకమ్మ సంబరాలు

### ప్రభుత్వ జూనియర్ కళాశాలలో





ఆత్మకూర్, అక్టోబర్ 05 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. సంబరాల్లో భాగంగా కళాశాల విద్యార్థులు రంగురంగుల పువ్వులతో బతుకమ్మను అలంకరించి కళాశాల ఆవరణంలో విద్యార్థులు మరియు అధ్యాపక బృందం ఆధ్వర్యంలో బతుకమ్మ పాటలతో బొడ్డెమ్మ లతో కోలాటలతో ఘనంగా బతుకమ్మ సంబరాలు జరుపుకు న్నారు. ఇట్టి కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.భాగ్య వర్ధన్ రెడ్డి సీనియర్ అధ్యాపకులు టీజీ విశ్వేశ్వర్, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ ఏకే కురుమూర్తి, అధ్యాపకులు జమ్మన్న, రాఘవేంద్ర రావు, శ్వేత, వీణ, లతమ్మ, చైతన్య, రాణి ,పావని, సునీల్ కుమార్, రాఘవేంద్ర, బాలకృష్ణ ,బుచ్చయ్య, రామన్ గౌడ్, సతీష్ కుమార్, అనిత, విమల సీనియర్ అసిస్టెంట్ రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ స్కూల్ పాత భవనంలో మోడల్ వన్ సైన్స్ సెంటర్

రాజన్న సిరిసిల్ల: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత భవనంలో న అత్యున్నత స్థాయి సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయ్యాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని కాన్ఫరెన్స్ హల్ లో జిల్లా సైన్స్ ఫోరం జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ చర్చించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సైన్స్ సెంటర్ ఆవశ్యకత, సైన్స్ సెంటర్ ఏ విధంగా రూపొందించాలి. సైన్స్ సెంటర్లో ఉండాల్సిన అంశాలు, వివిధ రకాల సలహాలు, సూచనలు చేశారు. సైన్స్ సెంటర్లో ఉండే ప్రాజెక్టు వర్కింగ్ మోడల్ గా ఉండాలని, సైన్సు సెంటర్ అనేది పాఠశాల స్థాయికి, కళాశాల స్థాయికి, సమాజం నుంచి వచ్చే ప్రతి పౌరులు నేర్చుకునే విధంగా సైన్స్ సెంటర్ ఉ ండాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల వారు సైన్స్ సెంటర్ ను సందర్శించే విధంగా ఉండాలని, చదువుకోని వారికిసైతం విషయ అవగాహన పెంపోందే విదంగా ఉండాలి. సైన్స్ సెంటర్ ను సందర్శిస్తే కొత్త శాస్త్రీయ విజ్ఞానాన్ని పొందే విధంగా ఉండాలని సూచించారు. అత్యాధునిక పద్దతిలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని కలగలుపుకుని ఒక మాడల్ సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయడానికి అన్ని విధాల సహకారం ఉంటుందని తెలిపారు. దీనికోసం వివిద ప్రాంతాలలో వివిద రకాల సైన్స్ మ్యూజియంలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఒక నివేదిక ప్రకారం మాడల్ వన్ సైన్స్ సెంటర్ తయారికి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రామస్వామి, జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్, భౌతిక శాస్త్రం ఫోరం, జీవశాస్త్ర ఫోరం, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో కన్సల్టెన్సీల ప్రభావం పెరుగుతోంది

### - గీతం చర్చాగోష్ఠిలో వక్తల అభిప్రాయం



పటాన్‌చెరు: భారతదేశ ఎన్నికల ప్రచారంలో రాజకీయ కన్సల్టెన్సీల ప్రభావం క్రమంగా పెరుగుతూనే ఉందని ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు అభిప్రాయపడ్డారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం పరిధిలో ఉన్న గీతం యూనివర్శిటీలోని "స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్" అధ్వర్యంలో 'భారతదేశంలో ఎన్నికల ప్రచారాలు %-% పెరుగుతున్న రాజకీయ సలహాదారుల పాత్ర' అనే అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా "భారతదేశ ఎన్నికల దృశ్యంలో రాజకీయ కన్సల్టెన్సీల పాత్ర పెరగడం"పై లైడెన్‌లోని రాయల్ నెదర్లాండ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏషియన్ అండ్ కరీబియన్ స్టడీస్‌లో రీసెర్చ్ ఫెలో డాక్టర్ విఘ్నేష్ కార్తీక్ మాట్లాడారు. ఎన్నికల కన్సల్టెన్సీలు వ్యూహాత్మక వనరుల కేటాయింపు, ఉపన్యాస మెళకువలు, సిబ్బంది నిర్వహణ ద్వారా పార్టీలకు అధికారం ఇస్తాయని, పొలిటికల్ ఎడ్జ్ (2014) వంటి మార్గదర్శకుల నుంచి నేషన్ విత్ నమో (2023-24) వంటి సైద్ధాంతిక కన్సల్టెన్సీలుగా మారడాన్ని ఉటంకించారు. ఈ మార్పునకు దారితీసిన ముఖ్య కారకాలు.. దేశంలోని అధిక జనాభా, లోతైన ప్రజాస్వామ్యీకరణ, పెరిగిన సాంకేతిక వినియోగం, సగం మంది మాత్రమే తిరిగి ఎన్నికవడమని తెలిపారు. భారతదేశ ఎన్నికల ఖర్చులు ఇప్పుడు అమెరికాకు పోటీగా ఉన్నాయని, స్థిరమైన అభివృద్ధి కార్యక్రమాలు పార్టీలకు ప్రధాన ఆందోళనగా ఉద్భవించాయని చెప్పారు. భారత రాజకీయ పార్టీలను కేంద్రీకృత ఎన్నికల యంత్రాలుగా మార్చడం గురించి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ కైలాష్ కున్ని క్రిష్ణన్ మాట్లాడారు. 1989 నుంచి రెండు పార్టీల పోటీ నుంచి మూడవ పార్టీ వ్యవస్థ ఆవిర్భావాలను ప్రస్తావించారు. అనేక రాజకీయ పార్టీలు ఇప్పుడు వారి సంస్థాగత నిర్మాణాలు, సిద్ధాంతాల్లో చాలా సారూప్యతను కలిగి ఉన్నాయన్నారు. బయటి నిధుల వనరులపై ఎక్కువగా ఆధారపడే రాజకీయ నాయకుల జవాబుదారీతనం గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్య ప్రక్రియలు, పార్టీ సభ్యులు పాల్గొనే విధానాలు ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీ నాయకత్వం తరచుగా స్వయంగా ఎన్నికల ఖర్చును భరించగల అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తోందన్నారు. రాజకీయ పార్టీల్లో ప్రజాస్వామ్యం, జవాబుదారీతనంపై ఈ మార్పుల ప్రభావం గురించి ఆలోచించాల్సిన అవశ్యకత ఏర్పడిందన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ మయాంక్ మిశ్రా, డాక్టర్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# టీజీపీఎస్సీ వద్ద గ్రూప్-1 పోస్టర్ల కలకలం

### - తెలుగు అకాడమీ ముందు కూడా
### - అభ్యర్థుల్లో ఆందోళన




హైదరాబాద్: హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యాలయం వద్ద గ్రూప్-1 పోస్టర్లను అంటించడం కలకలం రేపింది. అక్కడ గోడలు, గేట్లకు అవి వెలిశాయి. హిమాయత్‌నగర్‌లోని తెలుగు అకాడమి కార్యాలయం వద్ద కూడా ఆ పోస్టర్లను అంటించారు. దీనిపై అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

'తెలుగు అకాడమి పుస్తకాలు పోటీ పరీక్షలకు ప్రామాణికం కాదు'అని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో ఈ పోస్టర్లను అంటించడం గమనార్హం. అకాడమి పుస్తకాలను ఎవరూ కొనొద్దని విజ్ఞప్తి చేశారు. 'టీజీపీఎస్సీ ముందు నేను ఒక నియంతను. తప్పు జరిగితే ఒప్పుకోను'అని పోస్టర్లు వెలిశాయి. గ్రూప్-1 రాతపరీక్షల్లో 150 ప్రశ్నలను తయారు చేయలేని టీజీపీఎస్సీ ఎందుకు, సిగ్గు సిగ్గు అంటూ పోస్టర్లపై రాశారు. టీజీపీఎస్సీ వల్ల నిరుద్యోగ అభ్యర్థులకు ఎన్ని తిప్పలో అన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. వారిలో 31,382 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు. గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలు ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు హెచ్ఎండీఏ పరిధిలో జరుగుతాయి. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షల కీపై అభ్యంతరాలు ఉండడంతో కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇరువైపులా వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వు చేసినట్టు తెలిసింది.

# పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి: సీపీఐ(ఎం)

### - పెండ్లి వాగు మీద లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పునరుద్దరించి, అక్కడి వ్యవసాయ భూములకు సాగు నీరు అందించాలి
### - సీపీఐ(ఎం) పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట రెడ్డి




తాడ్వాయి : మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన లింగాల గ్రామంలోని ఆదివాసి రైతుల,పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పెండ్లి వాగు మీద లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రోత్సహించి వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలని సీపీఐ(ఎం) పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లింగాల గ్రామంలోని సీపీఐ(ఎం) పార్టీ శాఖ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా మండల కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, మండల కార్యదర్శి దుగ్గి చిరంజీవి లు మాట్లాడుతూ..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పోడు భూములకు కొంతమంది రైతులకు మాత్రమే పట్టాలు ఇచ్చిందని, ఇంకా చాలామందికి ఇవ్వాల్సి ఉ ందని, అంతేకాకుండా ఆదివాసులతో సహజీవనం చేసుకుంటున్న గిరిజనేతరులకు కూడా హక్కు పత్రాలు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం అందరికీ పోడు పట్టాలు ఇవ్వాలని కోరారు. 2003 సంవత్సరం లింగాల గ్రామంలో పెండ్లి వాగు మీద, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభించారని, ఆ పనులు పూర్తికాకుండానే మధ్యలోనే నిలిపివేశారని ఆయన మండిపడ్డారు. ఆ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేస్తే సుమారుగా 200 ఎకరాల కు సాగునీరు అందుతుందని, త్వరగా ఆ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పునరుద్ధరించి సాగునీరు అందించాలని తెలిపారు. తే కాకుండా లింగాల గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు ఇప్పటికీ రహదారి సౌకర్యం లేదని, రోడ్డు వేసి రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. కొడిశల, లింగాల గ్రామాల మధ్యలో సుమారు 7 కిలోమీటర్ల రోడ్డు కంకర పోసి నిలిపివేశారని ఆయన మండిపడ్డారు. ఆ రోడ్డు మార్గాన యాక్సిడెంట్ అవుతున్న ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆయన తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బీటీ రోడ్డు పనులు నాణ్యతగా తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ శాఖ మహాసభలో శాఖ కార్యదర్శిగా కోరం రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఊకె ప్రభాకర్, ఊకె నాగేశ్వర్ రావు, జన్ను ఎల్లయ్య, పెనక కాంతారావు, ఊకె సమ్మక్క, పూనెం సుధాకర్, పాయం నారాయణ, తోలేం చంద్రయ్య, కోరం సారయ్య, పెనుక ఉపేంద్ర , పూనెం అబ్బయ్య, జన్ను చంద్రకళ, చాపల పెంటమ్మ, కోరం సునీత, ఊకె సుమలత తదితరులు పాల్గొన్నారు.

# నాటు బాంబు తయారీదారుల ముఠా అరెస్టు

హుస్నాబాద్: హుస్నాబాద్ నాటు బాంబులను తయారు చేస్తున్న వ్యక్తితోపాటు జంతువులు, వణ్యప్రాణులను వేటాడుతున్న ముఠాను పట్టుకుని ఐదుగురి వ్యక్తులను రిమాండ్ కి తరలించినట్లు హుస్నాబాద్ సీఐ కొంద్ర శ్రీను తెలిపారు. హుస్నాబాద్ సర్కిల్ కార్యాలయంలో మీడియా సమావేశన్ని నిర్వహించి వివరాలు సీఐ శ్రీను వెల్లడించారు.

గత కొన్ని రోజుల క్రితం మిర్జపూర్ లో గుర్తు తెలియని వ్యక్తులు గుట్ట పక్కన ఉన్న వ్యవసాయ క్షేత్రాల వద్ద జంతువులు, వన్యప్రాణులు కోసం నాటు బాంబులు పెట్టారు. ప్రమాదవశాత్తు ఆ బాంబు పేలి అదే గ్రామానికి చెందిన ఎమ్ డి. ఖలిం వ్రేళ్ళకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడు అన్న తాజుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశామన్నారు. మిర్జాపూర్ గ్రామంలోనీ ఓ ఇంటిలో నాటు బాంబులు ఉన్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లడంతో నాటు బాంబులు దొరికాయని తెలిపారు. నాటు బాంబులు తయారు చేస్తున్న పిట్టల స్వామి, బధనపురం తిరుపతి, ఎరుకల తిరుపతి, కందుకూరి భాస్కర్, కమ్మరి భాస్కర్, ఇటిక్యాల సతీష్ ల పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు. వన్యప్రాణులను జంతువులను వేటాడేందుకు నాటు బాంబులు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హుస్నాబాద్ సిఐ కొంద్ర శ్రీను హెచ్చరించారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ ఎస్సై తోట మహేష్, కానిస్టేబుల్స్ నరేష్,రాజు, శేఖర్, తదితరులున్నారు.

# ఎల్ఆర్ఎస్ మరింత ఆలస్యం..?

- చెరువుల బఫర్ జోన్లు కలిశాయన్న అనుమానాలు
- దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న అధికారులు
- 10-15శాతం ఎఫ్‌టీఎల్, బఫర్‌లో ఉన్నట్టు గుర్తింపు
- మేడ్చల్ జిల్లాలో 40వేలకు పైగా దరఖాస్తుల పరిశీలన
- మిగతా చోట్ల అదే పనిలో ప్రభుత్వ సిబ్బంది




సిటీ: లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) ప్రక్రియ మరింత ఆలస్యం కానున్నట్టు తెలుస్తోంది. ఎల్ఆర్ఎస్ కింద వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నట్టు అనుమానాలు రావడంతో అధికారులు క్షుణ్నంగా పరిశీలిస్తున్నారు. మూడు దశల్లో పరిశీలించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ కావడంతో అధికారులు ఆ పనిలో ఉన్నారు. క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిష్కార బాధ్యతలను ప్రభుత్వం స్థానిక సంస్థలను పర్యవేక్షించే అదనపు కలెక్టర్లకు అప్పగించింది. ఈ క్రమంలో ఆ పనుల్లో అధికారులు నిమగమయ్యారు.

రాష్ట్ర వ్యాప్తంగా భూముల క్రమబద్ధీకరణపై ప్రభుత్వానికి 25.67 లక్షల దరఖాస్తులు అందాయి. అందులో పురపాలక సంఘాల పరిధిలో 10.54 లక్షలు, గ్రామ పంచాయతీల పరిధిలో 10.76లక్షలు, మిగిలినవి కార్పొరేషన్ల పరిధిలో వచ్చాయి. ప్లాట్లకు సంబంధించినవి 25.53లక్షలు కాగా, లేఅవుట్ల దరఖాస్తులు 0.13లక్షలు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు పరిశీలించినవి 4.50లక్షలు మాత్రమే. ఆమోదం పొందినవి 70వేల లోపే.. ఈ దరఖాస్తులపై ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ, మున్సిపాల్టీల అధికారులు కొత్త నిర్ణయం తీసుకున్నారు. దరఖాస్తుల్లో కొన్ని బఫర్ జోన్లలో ఉన్నట్టు అనుమానాలు రావడంతో రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు క్షేత్ర స్థాయిలో భూములను పరిశీలిస్తున్నారు. జియో మ్యాపింగ్ సరిహద్దులు, హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లోని చెరువుల ప్రాథమిక నోటిఫికేషన్, తుది నోటిఫికేషన్లను పరిగణలోకి తీసుకుంటున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో ఉంటే వాటిని తిరస్కరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తూంకుంట, మేడ్చల్, గుండ్ల పోచంపల్లి, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాల్టీలు, పీర్జాదిగూడ, బోడుప్పల్ కార్పొరేషన్ల పరిధిలోని దరఖాస్తుల్లో 10 నుంచి 15శాతం ఇలాంటివే ఉన్నట్టు అధికారులు తెలిపారు.

హైడ్రా ప్రభావం

క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిష్కార బాధ్యతలను ప్రభుత్వం స్థానిక సంస్థలను పర్యవేక్షించే అదనపు కలెక్టర్లకు అప్పగించిన విషయం తెలిసిందే. వీటిని మూడంచెల్లో (ఎల్-1, ఎల్-2, ఎల్-3) పరిష్కరించాలంటూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దరఖాస్తులను పరిశీలించాక, అధికారులు ఆమోదించేలా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో దరఖాస్తులను ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సూచనల ఆధారంగా మున్సిపల్ అధికారులు పరిష్కరించారు. హైడ్రా ఏర్పాటుతో క్షేత్ర స్థాయిలో పరిశీలించి చెరువుల సరిహద్దులు, బఫర్ జోన్లను నిర్ధారించి దరఖాస్తుదారు పేర్కొన్న సర్వే నెంబర్ విస్తీర్ణం బఫర్ జోన్‌లోకి వస్తుందా..? అన్న అంశాలను తేల్చనున్నారు. గ్రామ పరిధిలోని నక్ష, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన జీడీపీఎస్‌లతో సర్వే నిర్వహించనున్నారు. ఇలాంటివి జిల్లాలోని మున్సిపాల్టీలు, గ్రామాల్లో కలిపి దాదాపు 40వేలకు పైగా క్రమబద్దీరణ దరఖాస్తులను పరిశీలిస్తున్నట్టు సమాచారం. జిల్లా వ్యాప్తంగా మొత్తం లక్షా 70వేల వరకు ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు రాగా.. ఇప్పటి వరకు దాదాపు 3వేలకు పై చిలుకు మాత్రమే పరిష్కరించినట్టు ఓ అధికారి తెలిపారు.

# ఆడపడుచులకు కానుక ఉన్నట్లా? లేనట్లా?

- ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు
- చీరల పంపిణీపై రాని స్పష్టత
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న మహిళలు



మల్హర్ రావు.: బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఆడపడుచులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే కానుకలు ఈసారి లేనట్లుగానే కనిపిస్తోంది. బతుకమ్మ చీరల పంపిణీని రద్దు చేస్తున్నామని. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు మాత్రమే ఏడాదికి రెండు చీరలను ఉచితంగా అందజేస్తామని ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కానీ దానిపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. ఓ దశలో చీరలకు బదులుగా ఆడపడచులకు ఒక్కొక్కరికి రూ.500 నగదును వారి ఖాతాల్లో జమచేసేలా ఆలోచిస్తున్నట్లుగా ప్రచారం జరిగింది. కానీ దీనిపైనా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. మరోవైపు బతుకమ్మ వేడుకలు మండలంలో ప్రారంభమయ్యాయి. ఆడపడచులు తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మలతో సందడి చేస్తున్నారు. అయితే ప్రభుత్వం బతుకమ్మ కానుకగా ఏం ఇస్తుందా? అనే దానిపై మహిళలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా దృష్టి సారించకపోవడంతో ఈ యేడు కానుకలు లేనట్లుగానే తెలుస్తోంది.

గత ప్రభుత్వంలో చీరల పంపిణీ..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కొన్నేళ్ల పాటు ఆడపడుచులకు చీరలను కానుకగా అందించింది. బతుకమ్మ వేడుకల ప్రారంభానికి ముందుగానే మండలానికి అవసరమైన చీరలను పంపించేది. వాటిని డీఆర్డీఏ, మెప్మా శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఎంతో ఆర్భాటంగా పంపిణీ చేసేవారు. రేషన్ కార్డు కలిగి ఉండి, 18 ఏళ్ల వయస్సు నిండిన యువతులు, మహిళలందరికీ ఈ చీరలను అందించేవారు. గతేడాది మండలంలో 15 గ్రామాలకు గానూ 8,906 చీరలను ప్రభుత్వం పంపిణీ చేసింది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన చీరల నాణ్యతపైన అప్పట్లో పలువురు మహిళలు అసహనం వ్యక్తం చేశారు. పలుచోట్ల చీరలను దగ్ధం చేసిన మహిళలు అప్పటి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆందోళనలను సైతం చేపట్టారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ సైతం చీరల నాణ్యతపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యం లోనే వాటి పంపిణీని రద్దు చేసినట్లుగా తెలుస్తోంది.

ఎస్ హెచ్ జి మహిళలకు మాత్రమే

ఇటీవల హైదరాబాద్లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి బతుకమ్మ చీరల పంపిని కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లుగా ప్రకటించారు. స్వయం సయక సంఘాల్లోని సభ్యులకు మాత్రమే ఏడాదికి రెండు చీరలను ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. దీంతో లబ్దిదారుల సంఖ్య భారీగా తగ్గిపోయే అవకాశముంది. అయితే ప్రభుత్వం ఇచ్చినా అవి కూడా ప్రస్తుత బతుకమ్మ పండుగకు అందేలా కన్పించడం లేదు. బతుకమ్మ వేడుకలు మండలంలో ప్రారంభమయ్యాయి. దసరా పండగ సైతం మరో 8 రోజుల్లోనే ఉంది. ఇప్పటికిప్పుడు చీరలను జిల్లాకు పంపించినా జిల్లా నుంచి మండలాలకు అక్కడి నుంచి గ్రామాలకు పంపిణీ చేయడం అసాధ్యంగానే మారనుంది. కాగా చీరలకు బదులుగా రూ.500 నగదును మహిళల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జను చేస్తుందనే చర్చ సైతం జోరుగా సాగింది. దీనిపై మహిళల్లో హర్షం వ్యక్తమైంది. ప్రభుత్వం చీరలకు బదులుగా నగదు జమచేస్తుందనే ప్రచారం వారిలో ఆనందం నింపింది. అయితే దీనిపై ప్రభుత్వం కానీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో అది ప్రచారంగానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆడపడుచులకు బతుకమ్మ కానుకలను అందిస్తుందా? లేక వాటిని రద్దు చేస్తుందా? అనేదానిపై ప్రస్తుతం మహిళావర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రభుత్వం నిర్ణయంపై వారు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే అధికారికవర్గాల్లో మాత్రం ఈ యేడు బతుకమ్మ కానుకలు ఉండకపోవచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# వాతావరణ మార్పులతో అన్నదాత బెంబేలు

- వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలు
- జనాభా అవసరాలు తీర్చలేకపోతున్న పంట దిగుబడులు
- 70 కోట్ల మంది పేదలకు పట్టెడన్నం కరువు
- నూతన వంగడాల సృష్టి తప్పనిసరి




న్యూఢిల్లీ: వాన రాకడ, ప్రాణం పోకడ ఎవరికీ తెలియదని ఓ సామెత. సకాలంలో వర్షాలు పడితే అన్నదాతలు తమ పొలాలలో విత్తనాలు వేసుకుంటారు. అసాధారణ రీతిలో కుంభవృష్టి కురవడం, అంతలోనే కొద్ది రోజుల పాటు ఎండలు మండిపోవడం ఇప్పుడు సర్వసాధారణమైపోయింది. ఇలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులలో పంట ఎప్పుడు వేసుకోవాలో తెలియక రైతు అయోమయంలో పడిపోతున్నాడు. గతంలో వర్షాకాలం ప్రారంభం కాగానే తొలకరి జల్లులు పలకరించేవి. రైతులు ఉత్సాహంగా ఏరువాక పనులు మొదలు పెట్టేవారు. కానీ ఇప్పుడా వాతావరణం లేదు. అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షాలను చూసి విత్తనాలు వేసుకున్నా అవి మొలకెత్తడం లేదు. ఎడతెరిపి లేకుండా వానలు పడడమో లేదా రోజుల తరబడి పొడి వాతావరణం నెలకొని ఉండడమో దీనికి కారణం.

అందుబాటులో మేలైన రకాలు

ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని మంచి దిగుబడులను అందించే మేలైన విత్తనాల ఉత్పత్తికి శాస్త్రవేత్తలు నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారు. నూతన వంగడాలతో పలువురు రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలలో ప్రయోగాలు చేస్తూ మంచి ఫలితాలు పొందుతున్నారు. తక్కువ నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, క్రిమికీటకాల బెడద అధికంగా ఉన్నప్పటికీ వాటిని తట్టుకొని అధిక దిగుబడులు అందించే వంగడాలు ఇప్పుడు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఇప్పటికీ కొన్ని పాత రకాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటోంది. రైతులు వాటినే ఎక్కువగా విశ్వసిస్తున్నారు.

పరిశోధనా సంస్థల చేయూత

ప్రపంచంలో అత్యధికంగా వరి, గోధుమలు పండించే దేశాలలో భారత్ కూడా ఒకటి. ప్రపంచంలోని ఇతర దేశాలలోని పరిశోధనా సంస్థలకు మాదిరిగానే మన దేశంలోని సంస్థలు కూడా చీడపీడలను తట్టుకొని, మంచి ఫలితాలు అందించే వంగడాల ఉత్పత్తి కోసం కృషి చేస్తున్నాయి. కొన్ని వంగడాలు నీటి ఎద్దడిని కూడా సమర్ధవంతంగా తట్టుకుంటాయి. వాతావరణంలో వస్తున్న అనూహ్య మార్పుల కారణంగా ఇలాంటి రకాల అవసరం మరింత పెరుగుతోంది. ఆహారోత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించే దిశగా ఆ సంస్థలు తమ వంతు ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నాయి. అమెరికా ప్రభుత్వ కార్యక్రమాలు, కొన్ని ప్రైవేటు నిధులతో నడుస్తున్న ప్రాజెక్టులు ఆఫ్రికా, మధ్య అమెరికా, ఇతర ఆసియా దేశాలలో వాతావరణ మార్పులను తట్టుకొనే పంటలను అభివృద్ధి చేస్తున్నాయి.

కష్టాల కడలిని ఈదుతున్న రైతులు

మన దేశంతో పాటు అనేక ప్రపంచ దేశాలు వాతావరణ మార్పులను తట్టుకోలేకపోతున్నాయి. ఆయా దేశాలపై అధిక వర్షాలు, కరువు కాటకాల ప్రభావం ఎక్కువగా పడుతోంది. ఈ నేపథ్యంలో దేశ ప్రజలకు అవసరమైన ఆహారాన్ని అందించడంతో పాటు ఎగుమతి చేసే స్థాయికి కూడా చేరుకోవాలంటే నూతన వంగడాలను వినియోగించ క తప్పదు. దేశంలో వాతావరణంలో చోటుచేసుకుం టున్న మార్పుల కారణంగా అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దేశంలో సుమారు 12 కోట్ల మంది రైతులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మందికి ఐదు లేదా అంతకంటే తక్కువ ఎకరాల భూ కమతాలు మాత్రమే ఉన్నాయి. అనూహ్యంగా దంచికొడుతున్న వానలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, మరోవైపు చీడపీడల దాడి%ౌ%ఇవన్నీ రైతన్నను కష్టాల కడలిలో ముంచేస్తున్నాయి.

# బాలవికాస కేంద్రాలు ప్రగతి అభివృద్ధి సోపానాలు

- పైడాకుల అశోక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



గోవిందరావుపేట: బాదావికాస స్వచ్ఛంద సేవా కేంద్రాలు ప్రగతి అభివృద్ధి సోపానాలు అని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ అన్నారు. మండలంలోని బుసాపురం గ్రామంలో బాలవికాస మహిళా కేంద్రం తరుపున ఏర్పాటుచేసిన మంచి నీటి కేంద్రాన్ని అశోక్ ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి అశోక్ మాట్లాడుతూ.. ప్రజలకు సురక్షిత నీరు అందించడమే లక్ష్యంగా బాల వికాస కేంద్రాలు ముందుకు సాగుతున్నాయి అన్నారు. మహిళా సంఘాలను ప్రోత్సహించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం అని, బాల వికాస కేంద్రాలు ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రగతి పథంలో నడుస్తుందని అన్నారు. అలాగే బాల వికాస కేంద్రాలు ముఖ్యంగా ప్రజలకు సురక్షిత మంచి నీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని, అలాగే వితంతువుల సాధికారత, అనాథ పిల్లలను అక్కున చేర్చుకుని ఉచిత విద్య అందించి ప్రయోజకులను చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని, వృద్దులు మరియు నిరాశ్రయులకు అండగా నిలబడి వారికి ఆశ్రయాన్ని ఇస్తుందని, కరోనా సమయంలో కూడా వారు కరోనా గురించి అవగాహన కల్పిస్తూ, కరోనా రాకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో అందరికీ తెలియజేస్తూ, కరోనా బారిన పడిన వారిని ఎలా చూసుకోవాలి అని వారి కుటుంబ సభ్యులకు తెలియజేస్తూ, ప్రజలందరికీ అండగా నిలబడింది బాల వికాస కేంద్రం అని అన్నారు. బాల వికాస కేంద్రం ఏర్పాటు చేసిన సురక్షిత మంచి నీటి కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో స్థానిక మండల అభివృద్ధి అధికారి జవహర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి జితేందర్ రెడ్డి, బాల వికాస ఎండి మదన్ మోహన్ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ బాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పాశం మాధవ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య, సహకార సంఘ అధ్యక్షులు పన్నాల ఎల్లారెడ్డి, యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింత క్రాంతి, బేతి దేవేందర్ రెడ్డి, పాలెం యాదగిరి, రాజబాబు, గంప సురేష్, మర్కాల రాజశేఖర్ రెడ్డి, బండపెల్లి శివుడు, దీకొండ భరత్, తుమ్మల శివ, బాల వికాస మహిళా కేంద్రం సభ్యులు అందరూ పాల్గొన్నారు.

# సైకిలిస్టుల కోసం ఏం చేస్తున్నారు?

న్యూఢిల్లీ: దేశంలో సైకిలిస్టుల హక్కుల పరిరక్షణకు ఏం చేస్తున్నారని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) కేంద్రాన్ని ప్రశ్నించింది. రోడ్డు ప్రమాదాలలో సైకిలిస్టులు ప్రాణాలు కోల్పోవడం, గాయపడడం వంటి ఘటనలు జరుగుతున్నాయని గుర్తు చేస్తూ వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటో చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శికి నోటీసు జారీ చేసింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సైకిలిస్టులు, పర్యావరణ ప్రేమికులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని ఎన్‌హెచ్ఆర్‌సీ గుర్తు చేసింది. మానవ హక్కుల కార్యకర్త రాధాకాంత త్రిపాఠి దాఖలు చేసిన పిటిషన్‌ను పురస్కరించుకొని ఎన్‌హెచ్ఆర్‌సీ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఆరు వారాలలోగా నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించింది. దేశంలోని రోడ్లు ప్రాణాంతకంగా మారాయని, ప్రమాదాల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, పలువురు గాయపడ్డారని పిటిషనర్ తన దరఖాస్తులో ప్రస్తావిం చారు. అందరికీ సురక్షితమైనవిగా ఉండేలా భారతీయ రోడ్లను రూపకల్పన చేయాలని కోరారు. స్థిరమైన రోడ్లు, స్పీడ్ లైన్లు, మధ్యలో విరామాలతో పాటు పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పిటిషనర్ సూచించారు. సైకిలిస్టుల భద్రత, రక్షణ విషయంలో తగిన యంత్రాంగం లేదని, ప్రభుత్వ వైఫల్యం కన్పిస్తోందని త్రిపాఠీ విమర్శించారు. పలు రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తున్నప్పటికీ వారికి హెల్మెట్లు ఇవ్వడం లేదు. రోడ్డు భద్రతకు అనుగుణంగా సైకిళ్లు ఎలా నడపాలన్న విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం లేదు. హైవేలలోని రోడ్లపై బ్లాక్‌స్పాట్లు, ప్రమాద జోన్లను సరిగా గుర్తించడం లేదు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో సైకిలిస్టుల కోసం రోడ్లపై ప్రత్యేకంగా లైన్లు అనేవి లేవు. అంతేకాదువారి కోసం ప్రత్యేక చట్టాలు, నిబంధనలు, మార్గదర్శకాలు కూడా లేవు. రోడ్లన్నీ ఆక్రమణ లకు గురవుతు న్నాయి. మందుబాబులు తప్పతాగి రోడ్లపై వాహనాలు నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. 2022లో మన దేశంలో రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రతి రోజూ సగటున పది మంది సైకిలిస్టులు ప్రాణాలు కోల్పోయారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) అందించిన వివరాల ప్రకారం అదే సంవత్సరం దేశంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో 3,435 మంది చనిపోయారు. మరో 6,426 మంది గాయపడ్డారు. ఆ ఏడాది ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక సంఖ్యలో సైకిలిస్టులు మరణించారు. 2021లో బీహార్‌లో ఎక్కువ మంది సైకిలిస్టులు ప్రాణాలు కోల్పోగా 2018-20 మధ్యకాలంలో తమిళనాడులో అత్యధిక మరణాలు సంభవించాయి. 2015, 2016లో మహారాష్ట్రలో సైకిలిస్టుల మరణాలు ఎక్కువగా జరిగాయి.

# హైడ్రాకు మరిన్ని అధికారాలు...

హైదరాబాద్: హైడ్రా.. ఈ పేరు వింటేనే హైదరాబాద్‌లోని ఎల్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మించిన ఇళ్ల యజమానుల గుండెల్లో బుల్డోజర్లు పరిగెత్తుతున్నాయి. ఎప్పుడు హైడ్రా బుల్డోజర్ తమ ఇంటిపైకి వస్తుందో అని వణికిపోతున్నారు. రెండు నెలల క్రితం ఏర్పడిన హైడ్రా తన దూకుడుతో ఇప్పటికే వందల ఎకరాలకుపైగా ఆక్రమిత స్థలాన్ని చెర విడిపించింది. ఇందుకోసం వందలాది ఇళ్లు, ఇతర నిర్మాణాలను నేల మట్టం చేసింది. చేస్తోంది. హైడ్రా దూకుడుతో నిత్యం పదుల సంఖ్యలో ఇళ్లు నేలమట్టం అవుతున్నాయి. మూడు రోజుల క్రితమే హైడ్రా స్పీడ్‌కు హైకోర్టు కాస్త బ్రేకులు వేసింది. అయినా హైడ్రా కూల్చివేతలు మాత్రం పూర్తిగా ఆగలేదు. ఇదిలా ఉంటే.. తాజాగా తెలంగాణ ప్రభుత్వం ?హై డ్రాకు మరిన్న అధికారాలు కట్టబెట్టింది. హైడ్రాకు చట్టబద్ధత, అధికారాలను కోర్టుతోపాటు పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ తరుణంలో రేవంత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా హైడ్రాకు మరిన్ని పవర్స్ అప్పగిస్తూ ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఈ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలుపడంతో చట్టబద్ధత లభించింది.

దీంతో ఇక హైడ్రా చేపట్టే అన్ని కార్యకలాపాలకు చట్టబద్ధత లభించింది. ఈ చట్టాన్ని శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. అప్పటి వరకు ఆర్డినెన్స్ హైడ్రాకు రక్షణగా ఉంటుంది. ఇటీవలే రూపొందించిన ఆర్డినెన్స్‌పై గవర్నర్ పలు సందేహాలు వ్యక్తం చేశారు. వాటిని పురపాలక శాఖ కార్యదర్శి దానకిశోర్ నివృత్తి చేశారు. దీంతో గవర్నర్ ఆర్డినెన్స్‌ను ఆమోదించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్?మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలోని చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు, క్రీడా మైదానాలను సంరక్షించడం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రక్షణ చర్యలు చేపట్టడం, భారీ వర్షాలు కురిసినప్పుడు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని క్రమబద్ధీకరించడం, అగ్నిమాపక సేవలకు సంబందించిన ఎన్‌వోసీ ఇవ్వడం తదితర కార్యలాపాల కోసం ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసింది. ఈమేరకు జూలై 19న జీవో 99 ద్వారా హైడ్రాను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విభాగం, విపత్తుల నిర్వహణ విభాగం ఇప్పటికే తమ పని చేస్తున్నాయి. తాజాగా ఆర్డినెన్స్‌తో మరిన్ని కీలకమైన అధికారాలను హైడ్రాకు కట్టబెట్టింది. హైడ్రాను మరింత బలోపేతం దిశగా పలువురు ఉన్నతాధికారులు, సిబ్బందిని నియమించింది.

కొత్త అధికారాలు ఇవీ..

? హైడ్రా ఆక్రమణలను పరిశీలించడం, నోటీసులు ఇవ్వడం, ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణలను తొలగించడం వంటి అధికారాలను జీహెచ్ఎంసీ చట్టం ? 1955 లోని సెక్షన్ 364(బి)ని ఆర్డినెన్స్‌లో చేర్చారు. అనదికార ప్రకటనలకు జరిమానా విధించే అధికారం కూడా హైడ్రాకు బదిలీ అయింది.

? పురపాలక చట్టం ?2019 ప్రకారం సంబంధిత కార్పొరేషన్, మున్సిపాలిటీ కమిషనర్లకు ఉన్న అధికారాలు, బీపాస్ చట్టం?2020 ప్రకారం జోనల్ కమిషనర్ నేతృత్వంలోని జోనల్ టాస్క్ ఫోర్స్, కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు ఉన్న అధికారాలు కూడా హైడ్రాకు కేటాయించారు.

హెచ్ఎండీఏ చట్టం ?2008 లోని పలు సెక్షన్ల కింద కమిషనర్‌కు ఉన్న అధికారం, తెలంగాణ భూ ఆదాయ చట్టంలోని సెక్షన్ 1317(ఎఫ్) ప్రకారం ఆక్రమణల తొలగింపు, ఆస్తుల పరిరక్షణకు సంబంధించిన ఆర్డీవో, కలెక్టర్‌కు ఉన్న అధికారాలు, ఇవే అంశాలకు సంబంధించి తెలంగాణ నీటిపారుదల చట్టంలోని అధికారాలు, జీవో 67 ద్వారా 2002లో యూడీఏ/ఎగ్జిక్యూటివ్ అధికారికి ఇచ్చిన అధికారాలను హైడ్రాకు కట్టబెట్టారు.

? ఇక భూ ఆక్రమణ చట్టం ? 1905లోని పలు సెక్షన్ల కింద కలెక్టర్, తహసీల్దార్, డీటీకి ఉన్న అధికారాలు, వాల్టా చట్టం ?2002, తెలంగాణ బిల్డింగ్ రూల్స్, తెలంగాణ ఫైర్ సర్వీసెస్ చట్టంలోని పలు అధికారాలను కూడా హైడ్రాకు వర్తింపజేశారు. అక్రమ నిర్మాణాలపై చర్య తీసుకోవడంలో జాప్యం లేకుండా కొత్త అధికారాలతో హైడ్రా మరింత స్పీడ్ పెంచే అవకాశం ఉంది.

# భారీ మోసాన్ని విఫలం చేసిన కెనరా బ్యాంకు




ఖమ్మం: ఖమ్మం నగరంలోని జుబిలిపుర కెనరా బ్యాంక్ శాఖలో ఒక సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ గ్రూపులకి సంబంధిం చిన మెప్మ ఆర్పీ చేసిన విఫలయత్నం నివ్వెరపరిచింది. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం నగరంలోని కెనరా బ్యాంక్ కి గత కొన్ని రోజులక్రితం వేరే బ్యాంక్ లోని హెల్ప్ గ్రూప్ లోన్ లని టేకోవర్ చేసికొని లోన్ సౌకర్యం కల్పించాలని విన్నపాలు వచ్చాయి. బ్యాంక్ వారు నియమాలనుగుణంగా కావల్సిన పత్రాలని సమర్పించాలని సూచించారు. తదుపరి అవసరమైన పరిశీలన చేసి బ్యాంక్ లోన్ మంజూరు చేసారు. ఈ ప్రక్రియలో భాగంగా గ్రూప్ సభ్యుల ఖాతాలోకి జమ చేయవలసిన సమయంలో కెనరా బ్యాంక్ సిబ్బంది గ్రూప్ సభ్యులను విచారిస్తుండగా, గ్రూప్ లీడర్లు తమకు 20 లక్షల రుణం మంజూరు అయినట్టు మెసేజ్ వచ్చినదని కానీ వారికి 10 వేలు రూపాయలు సబ్సిడీ వచ్చింది, తిరిగి వాటిని చెల్లించవలసిన అవసరం లేదు అని మెప్మా రిసోర్స్ పర్సన్ చెప్పినట్లుగా తెలిపినట్లు గురు సభ్యులు బ్యాంక్ సిబ్బందికి తెలిపారు. తమకు ఈ లోన్ తో ఎటువంటి సంబంధం లేదని 20 లక్షల రుణం గురించి తమకు చెప్పకుండా 10000 సబ్సిడీ వస్తుందంటే మాత్రమే తాము అప్లికేషన్పై సంతకాలు పెట్టామని వారు వివరించారు. సభ్యుల సమాచారం మేరకు జరిగిన మోసపూరిత చర్యని బ్యాంక్ వారు గుర్తించి సంబంధిత మెప్మా ఖమ్మం విభాగం వారి దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకునేల భరోసా పొందారు. అటుపిమ్మట బ్యాంక్ సిబ్బంది అన్నీ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లని ఉద్దేశిస్తూ, ఏ ఊరి నుండి అయిన సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లు ఋణాలు అవసరం ఉన్నట్లయితే బ్యాంక్ వారిని నేరుగా సంప్రదించి లబ్ధి పొందగలరని సూచించారు. ఇట్టి మోసపూరిత చర్యని సకాలంలో గుర్తించి పెద్ద మోసాన్ని కెనరా బ్యాంకు చాకచక్యంగా స్పందించి నివారించగలిగారు. సకాలంలో కెనరా బ్యాంకు స్పందించిన తీరు అద్భుతం అని చెప్పవచ్చు. బ్యాంకు ఎంత జాగ్రత్త గా కస్టమర్ సేవలు అందిస్తున్నాయి అనే విషయాన్ని మరోసారి రుజువు చేశారు. మోసానికి పాల్పడ్డ మెప్మా రిసోర్స్ పర్సన్ పై కెనరా బ్యాంక్ చట్టపరమైన చర్యల్ని తీసుకుంటామని తెలియజేసినది.

# డిజిటల్ సర్వేను పరిశీలించిన కలెక్టర్.



జయశంకర్ భూపాలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు సర్వే భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22 వ వార్డులో జరుగుతున్న ప్రక్రియను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ వార్డుల్లో పిలవ రాజయ్య, తోట సుగుణ ల గృహాల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియలో కుటుంబ సభ్యుల వివరాలు నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గణపురం మండలంలోని బుర్రకాయలగూడెం, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డును పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేసి సర్వే చేపట్టినట్లు తెలిపారు. సర్వేలో కుటుంబంలోని మహిళ పేరు, భర్త, పిల్లల వివరాలు, ఆధార్ కార్డు నెంబర్లు, ప్రస్తుత వయస్సు తదితర వివరాలు సేకరిస్తున్నామని అన్నారు. ప్రతి కుటుంబం యొక్క సమగ్ర వివరాలకు సంబంధించిన షీట్ ప్రత్యేకంగా ఉండాలని ఆయన సూచించారు. బుర్రకాయలపల్లిలో 161 గృహాలు, మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు లో 181 గృహాల్లోని ప్రజల సమాచారం సేకరణ చేస్తున్నామని అన్నారు. సర్వే సమగ్రంగా జరగాలని ప్రతి ఇంటిని నుండి కచ్చితమైన తప్పులు లేకుండా సమాచారం సేకరించాలని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి తప్పులకు తావు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. ప్రతి ఒక్కరూ అధికారులకు అవసరమైన సమాచారం ఇచ్చి సహకరించాలని సూచించారు. ఈ పైలట్ సర్వే ప్రక్రియ 7వ తేదీ వరకు నిర్వహించి వెంటనే ఆన్లైన్ ప్రక్రియ చేపట్టాలని నోడల్ అధికారిని ఆదేశించారు.

సర్వేలో ఎటువంటి సందేహాలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి ఆర్డీవో మంగీలాల్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, తహసిల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

**– సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్**

**– డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఆశా వర్కర్ల ధర్నా**




బేగంపేట: ఆశా వర్కర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో పొందుపర్చినవి.. ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చిన హామీలనే వెంటనే అమలు చేయాలని సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ అన్నారు. సికింద్రాబాద్‌లోని డీఎంహెచ్ఓ కార్యాలయం ముందు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023లో రాష్ట్రవ్యాప్తంగా 16 రోజులు అశా వర్కర్లు నిరవధిక సమ్మె చేశారని గుర్తు చేశారు. సమ్మె సందర్భంగా అప్పటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు కొన్ని నిర్థిష్టమైన హామీలు ఇచ్చారని తెలిపారు. అయితే, అందులో సమ్మె కాలం వేతనాలు మాత్రమే ప్రభుత్వం చెల్లించిందని..ఇతర సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఆరోగ్య శాఖ మంత్రి,ఆరోగ్య శాఖ రాష్ట్ర అధికారులను కలిసి అనేక విజ్ఞప్తులు చేశామని, ఆందోళనలు చేశామని తెలిపారు. అయినా ఇప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు గాంధీ ఆస్పత్రి, ఉస్మానియా ఆస్పత్రిలో పని భారం తగ్గించాలని, పెరుగుతున్న ధరలకనుగుణంగా రూ.18,000/- వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశాలకు ప్రతి సంవత్సరం 20 రోజుల వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు, 6 నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలన్నారు. టెన్త్, ఇంటర్, ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్, డిగ్రీ, టెట్, గ్రూప్ 1, 2 తదితర ఎగ్జామ్స్ సందర్భంగా ఆశాలకు వేస్తున్న డ్యూటీలకు డబ్బులు చెల్లించాలని కోరారు.యూనిఫామ్ వెంటనే ఇవ్వాలని, ఆశా లకు పనిభారం తగ్గించాలని,జాబ్ చార్ట్ ఇవ్వాలని, బిఎల్ఓ డ్యూటీలు వేయడాన్ని రద్దు చేయాలని, ఆశాలతో ఆన్‌లైన్ ఎంట్రీలను చేయించడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆశాల యూని యన్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు టి.యా దమ్మ, ఆశ వర్కర్లు ధర్నాలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ భక్తులుగా కొందరు పోలీసులు అధికారులు

హైదరాబాద్: మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ ,గట్టు రాంచందర్ రావు ,మన్నె గోవర్ధన్ రెడ్డి ,బీ ఆర్ ఎస్ లీగల్ టీమ్ సభ్యులు జక్కుల లక్ష్మణ్ ,కళ్యాణ్ ,లలితా రెడ్డి శుక్రవారం నాడు తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ .రాష్ట్రం లో కొందరు పోలీసులు కాంగ్రెస్ భక్తులుగా మారి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఖమ్మం లో మా నేతలపై ,హైదరాబాద్ లో మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కాంగ్రెస్ వాళ్ళు పోలీసుల సమక్షంలో దాడులు చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెడుతున్నారు. కాంగ్రెస్ వాళ్లు ఎలాంటి పోస్టులు పెట్టినా వారిపై కేసులు పెట్టడం లేదని అన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే గా గెలిచిన వివేక్ ఎన్నికలపుడు తన విశాఖ కంపెని నుంచి విజిలెన్సు సెక్యూరిటీ అనే సూట్ కేస్ కంపెనీ కి ఎనిమిది కోట్ల రూపాయలు అక్రమంగా బదిలీ అయ్యాయి. అపుడే ఈసీ కి ఈడీ కి నేను పిర్యాదు చేశాను.

నవంబర్ 23 ,2023 న ఈడీ విడుదల చేసిన ప్రెస్ నోట్ లో వివేక్ సూట్ కేసు కంపెనీ కి అక్రమంగా నగదు బదిలీ చేశారని నిర్ధారించింది. జనవరి 24 ,2024 లో కూడా వివేక్ ను ఈడీ విచారించింది. ఈడీ విచారణ ఇంకా కొనసాగుతుందని అన్నారు. రాష్ట్ర పోలీసులు మాత్రం ఆగస్టు లో ఈ కేసును మిస్టేక్ ఆఫ్ ఫాక్ట్స్ కింద మూసి వేస్తున్నట్టు కోర్టు కు పిటీషన్ ద్వారా తెలిపారు. ఈ పిటిషన్ ను సవాల్ చేస్తూ నాంపల్లి కోర్టు లో ప్రొటెస్ట్ పిటిషన్ వేశాము. రేవంత్ దగ్గర హోం శాఖ ఉంది కనుక వివేక్ ను కాపాడే యత్నం చేశారు. రేవంత్ వివేక్ ను కాపాడలేరు. అవసరమైతే హై కోర్టు ,సుప్రీం కోర్టు తలుపు కూడా తడతాం. వివేక్ ను రేవంత్ కాదు కదా భగవంతుడు కూడా కాపాడలేడని అన్నారు. సూట్ కేసు కంపెనీ ద్వారా ఎన్నికలకు డబ్బులు పంపి వివేక్ ఓటర్లను ప్రభావితం చేశారు. ఈడీ కేసులో వివేక్ జైలుకు వెళ్లడం ఖాయం ,ఎమ్మెల్యే పదవి ఊడటం ఖాయం ,చెన్నూరు కు ఉప ఎన్నిక రావడం ఖాయం. ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ. రేవంత్ విష కౌగిలి లో పోలీసులు బంధీ కావొద్దు. రేవంత్ రెడ్డి ఏది చెబితే పోలీసులు అది చేస్తారా ?. ఇన్కమ్ టాక్స్ ,ఈడీ లోతైన విచారణ చేస్తుంటే రాష్ట్ర పోలీసులు వివేక్ కేసును ను ఎలా మూసేస్తారు ? పీ లో ఏం జరుగుతుందో ఇక్కడి పోలీసు అధికారులు చూడటం లేదా ? రేవంత్ రాజకీయాల కోసం పోలీసులు మసి ఎలా అంటించుకుంటారు ? పోలీసు అధికారులు కాంగ్రెస్ ఏజెంట్లుగా మారిపోవద్దు. జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయి. పోలీసులు ప్రేక్షక పాత్ర మానుకోవాలని అన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం

## వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు ఆర్వీ కర్ణన్..

రాజన్న సిరిసిల్ల: ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యధిక ప్రసవాలు జరిగేలా కార్యాచరణ ఆసుపత్రుల వద్ద మందుల కొరత రాకుండా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి. సిరిసిల్ల వైద్య ఆరోగ్య శాఖ పై రివ్యూ నిర్వహించిన ఆరోగ్యశాఖ సంచాలకులు: సిరిసిల్ల జిల్లా పరిధిలోని ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యం అందేలా పటిష్ట కార్యాచరణను అమలు చేయాలని ఆరోగ్యశాఖ సంచాలకులు ఆర్వీ కర్ణన్ అన్నారు. శుక్రవారం ఆరోగ్యశాఖ సంచాలకులు ఆర్వీ కర్ణన్ రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, అదనపు కలెక్టర్లతో కలిసి సిరిసిల్ల వైద్య ఆరోగ్య శాఖ పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో జరుగుతున్న ప్రసవాల సంఖ్య, సీజనల్ వ్యాధులు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్య కళాశాల, తెలంగాణ డయాగ్నస్టిక్ సేవలు , ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల లభ్యత తదితర వివరాలను సంచాలకులు అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ సంచాలకులు ఆర్వీ కర్ణన్ మాట్లాడు తూ, ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యధికంగా ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించా లని, అత్యవసరమైన పక్షంలోనే సి సెక్షన్ ఆపరేషన్లు నిర్వహించాలని అన్నారు. సి సెక్షన్ ఆపరేషన్లను నియంత్రించడంలో గతంతో పోలిస్తే ఇప్పుడు సిరిసిల్ల జిల్లా మంచి పురోగతి సాధించిందని, ఇదే విధానంతో ముందుకు పోవాలని అన్నారు. అధికంగా సి సెక్షన్ ఆపరేషన్లు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసి ఆడిట్ నిర్వహించాలని సంచాలకులు అధికారు లను ఆదేశించారు జిల్లాలో నూతన ఆసుపత్రుల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మాత్రమే జరగాలని అన్నారు. పి.సి.ఎన్.బీ యాక్ట్ అమలు జిల్లాలో కట్టుదిట్టంగా నిర్వహించాలని, నూతన స్కానింగ్ సెంటర్లు, పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు కమిషనర్ అనుమతి తప్పనిసరని అన్నారు.జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల పనితీరు నిరంతరం పర్యవేక్షించాలని, ఆడపిల్లలు భ్రూణ హత్యలు జర్గకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పి.సి.ఎన్.బి యాక్ట్ అమ్మలకు సంబంధించి ఎప్పటికప్పుడు జిల్లా అడ్వైజర్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని అన్నారు.జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నస్టిక్స్ సేవల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి శాంపిల్స్ సేకరించి డయాగ్నస్టిక్ సెంటర్ ద్వారా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. రేడియాలజీ విభాగానికి సంబంధించి కూడా పరీక్షల నివేదికలు ఎప్పటికప్పుడు అందజేయాలని అన్నారు. ప్రతి ల్యాబ్ టెక్నీషియన్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలు సమర్థవం తంగా అందించేలా చూడాలని అన్నారు.సిరిసిల్ల జిల్లాలోని వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మంజూరైన స్టాఫ్, ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్టాఫ్ ఖాళీలు మొదల వివరాలను తెలుసుకున్నారు. వైద్య కళాశాల, అనుబంధ ఆసుపత్రి నిర్మాణ పనులు 2 సంవత్సరాల కాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకున్న చర్యలను సంచాలకులు పరిశీలిం చారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషెంట్ లను నిశ్చితంగా పరిశీలించి వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంత రావు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, మెడికల్ సూపరింటెండెంట్లు లక్ష్మీనారాయబణ, పెంచలయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ సంతోష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భారీగా పెరిగిన విమాన టిక్కెట్లు

ముంబై: ఇజ్రాయెల్ ఇరాన్‌ల మధ్య జరుగుతున్న ఘర్షణతో హైదరాబాద్ నుంచి అమెరికాకు వయా లండన్ ద్వారా వెళ్తున్న ప్రయాణికులకు టికెట్లు ధరలతో చుక్కలు కనిపిస్తున్నాయి. విమాన టిక్కెట్ల ధరలు 50 శాతం కంటే ఎక్కువగా పెరిగాయి. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి విమానాలు మళ్లించడంతో హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అమెరికాకు విమాన ప్రయాణ ఖర్చులు భారీగా పెరిగాయి .

హైదరాబాద్ నుంచి అమెరికాకు వెళ్లాల్సిన విమానాలు వయా లండన్ వెళుతుండడంతో విమానాల టికెట్ ధరలు రూ. 1.5 లక్షల మార్క్ దాటాయి.సాధారణంగా టిక్కెట్ ధరలు రూ. 90,000 నుంచి రూ. 1 లక్ష వరకు ఉంటాయి. కానీ తాజా ఘటనల కారణంగా మిడిల్ ఈస్ట్ దేశాలు దాటే విమాన సర్వీసులు రద్దు చేయడంతో ఇతర మార్గాలు మళ్లించడం వల్ల టిక్కెట్ల ధరలు భారీగా పెరిగాయి. కాంటినెంటల్‌తో పాటు అనేక ఇతర విమాన సర్వీసులు హైదరాబాదు నుంచి న్యూయార్క్, వాషింగ్టన్, డల్లాస్, శాన్‌ఫ్రాన్సిస్కో, అట్లాంటా, హ్యూస్టన్ నగరాలకు టిక్కెట్ ధరలను పెంచాయి. డల్లాస్ వంటి నగరాలకు ప్రస్తుతం టిక్కెట్లు రూ. 3 లక్షలకు చేరుకున్నాయి. లుఫ్తాన్సా విమాన సర్వీసులు హైదరాబాదు, ముంబయ్ వంటి నగరాలకు తమ సర్వీసులను రద్దు చేశాయి. ముఖ్యంగా ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణ కారణంగా మిడిల్ ఈస్ట్ దాటే సర్వీసులు రద్దు చేయబడుతున్నాయి. యూఎస్, యూకే వెళ్లే భారతీయ ప్రయాణికులకు గణనీయంగా ధరలు పెరిగాయి. హైదరాబాద్ నుంచి వెళ్లే వారికి పెరిగిన టికెట్ ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి.ఇప్పుడు ఇజ్రాయెల్ ఇరాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధం పలు అంశాల్లో ప్రపంచ దేశాలపై ప్రభావం చూపిస్తుంది. ఇటీవలే ఇరాన్ వందకుపైగా క్షిపణులతో ఇజ్రాయెల్‌పై దాడి చేసిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్‌కు అగ్రదేశమైనా అమెరికా మద్దతు పలుకుంది. దీంతో ఈ ఘర్షణ మరో యుద్ధానికి దారి తీస్తుందేమోనని ఆయా దేశాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# ఇద్దరు బాలికలపై ఐదుగురు యువకుల అత్యాచారం

హైదరాబాద్: తెలంగాణలో దారుణం జరిగింది. పునారావాస కేంద్రం నుంచి పారిపోయిన ఇద్దరు బాలికలపై ఐదుగురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలో బాలికల కోసం ఓ ప్రైవేట్ సంస్థ పునరావాస కేంద్రం నిర్వహిస్తోంది. జనగామ ప్రాంతానికి చెందిన బాలిక (14) మూడు నెలల నుంచి, మల్కాజిగిరికి చెందిన బాలిక (15) సెప్టెంబర్ 18 నుంచి అక్కడ ఆశ్రయం పొందుతున్నారు. ఇద్దరికీ తల్లిదండ్రులున్నా వేర్వేరు కారణాలతో అక్కడ చేర్పించారు. అయితే, కేంద్రంలో బాలికల మధ్య స్నేహం కుదిరి అక్కడి నుంచి వెళ్లిపోవాలని పథకం వేశారు. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 24న కిటికీ నుంచి దూకి పారిపోయారు. విషయం తెలుసుకున్న నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సైదాబాద్ పోలీసులు విచారణ చేపట్టారు. ఇద్దరు బాలికలు గత నెల 24వ తేదీన రాత్రి 8 గంటలకు జనగామ చేరుకున్నారు. బాలికల్లో ఒకరు బస్టాండ్ సమీపంలో ఉన్న పాన్ షాప్ నిర్వాహకుడు సాయిదీప్ దగ్గర ఫోన్ తీసుకుని తనకు పరిచయమున్న నాగరాజుకు ఫోన్ చేసింది. అతను వచ్చి ఆశ్రయం కల్పిస్తానంటూ తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బస్టాండ్ దగ్గరే ఒంటరిగా ఉన్న మరో బాలికను గమనించిన సాయిదీప్.. ఆశ్రయం కల్పిస్తానని పక్కనే ఉన్న బేకరీకి తీసుకెళ్లాడు. అక్కడ సాయిదీప్, బేకరీ నిర్వాహకుడు రాజు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. తాను తీసుకెళ్లిన బాలికను నాగరాజు 25వ తేదీన ఉదయం తీసుకొచ్చి బస్టాండ్ వద్దే వదిలేశాడు. బాలికల విషయం తెలుసుకున్న సాయిదీప్, రాజుల స్నేహితులు అఖిల్, రోహిత్‌లు హైదరాబాద్ తీసుకెళ్తామంటూ.. కారులో వేర్వేరు ప్రాంతాల్లో తిప్పుతూ లైంగిక దాడికి పాల్పడి తిరిగి బస్టాండ్ దగ్గరే వదిలిపెట్టారు. పోలీసులకు ఈ బాలికలు కనిపించడంతో అదే రోజు సైదాబాద్ తీసుకొచ్చి పునరావాస కేంద్రంలో అప్పగించారు. వారు భరోసా కేంద్ర నిపుణులను పిలిపించి కౌన్సెలింగ్ ఇప్పించగా.. బాలికలు తమపై లైంగిక దాడి జరిగిందని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐదుగురు యువకులపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# విద్యుత్ సంస్థల్లో ఖాళీ గా ఉన్న ఉద్యోగాలను భర్తీకి ప్రభుత్వం కసరత్తు

## లెక్కలు తేలిన వెంటనే నోటిఫికేషన్లు జారీ చేసే అవకాశాలు

హైదరాబాద్: విద్యుత్ సంస్థల్లో ఖాళీ గా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. జాబ్ క్యాలెండర్ ప్రకారం అక్టోబర్‌లో విద్యుత్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయాల్సి ఉ ండడంతో ఆ వివరాలను పంపాలని విద్యుత్ సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు సమాచారం. నాలుగు విద్యుత్ సంస్థల్లో మూడు వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోం ది. ఈ లెక్కలు తేలిన వెంటనే నోటిఫికేషన్లు జారీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఒక్కో కేడర్ వారీగా వివరాలను సంస్థ ల యాజమాన్యాలు సేకరిస్తున్నాయి. ఇటీవల విద్యుత్ పంపిణీ సంస్థలు, ట్రాన్స్‌కోలలో పెద్ద ఎత్తున పదోన్నతు లు ఇచ్చారు. జెన్‌కోలో మరి కొందరికి పదోన్నతులు క ల్పించనున్నారు. ఈ పదోన్నతులతో కిందిస్థాయిలో 3వేల కు పైగా ఖాళీలు ఏర్పడుతా యని అధికారులు చెబుతున్నారు. వీటన్నింటినీ నేరుగా నియామకాల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. డిస్కమ్‌లలో కిందిస్థాయిలో అసిస్టెంట్ లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్, సబ్ ఇంజనీర్, సహాయ ఇంజనీర్‌తో పాటు ఇతర విభాగాల్లో కూడా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ట్రాన్స్‌కో, జెన్‌కోలలో సహాయ ఇంజనీర్ పోస్టులకు కూడా భర్తీ చేయాల్సి ఉ ంది.మరో రెండు నెలల్లో యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభం కానుంది. దీనికి అవసరమైన సహాయ డివిజనల్ ఇంజనీర్, డివిజనల్, పర్యవేక్షక ఇంజనీర్ పోస్టులను సైతం పదోన్నతులపై భర్తీ చేయనున్నారు. వీటితో కిందిస్థాయిలో సహాయ ఇంజనీర్ పోస్టులు ఖాళీ కానున్నాయి. ఏడు సంవత్సరాల క్రితం భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి అవసరమైన పోస్టులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. యాదాద్రిలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కాబోతున్నందున పైస్థాయి పోస్టుల భర్తీకి పదోన్నతులు ఇప్పుడే ఇవ్వాలని విద్యుత్ ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఉత్పత్తి ప్రారంభమయ్యాకే ఇస్తామని జెన్‌కో యాజమాన్యం చెబుతోంది. దీంతో ఇంకా పదోన్నతులు ఇవ్వలేదని సమాచారం. పెగడపల్లిలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్వహణను జెన్‌కోకు అప్పగిస్తారని దానికి అవసరమైన పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ ఈ నిర్వహణ పనులను టెండరులో ఓ ప్రైవేటు సంస్థ దక్కించుకుంది. దీంతో ఈ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. వాటిని కూడా పదోన్నతుల ద్వారా నింపేసి భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ కేంద్రాల్లో ఉపయోగించుకోవాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.దీనివల్ల పోస్టులు, ఆర్థిక భారం పెరుగుతుందని యాజమా న్యం ఆపివేసినట్లు తెలిసింది. ఖర్చులు తగ్గించేందుకు జెన్‌కో కొత్త ప్రాజెక్టులు నిర్మించాలి : ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి కార్పొరేషన్ (టీఎస్-జెన్‌కో) ఆధ్వర్యంలో కొత్త విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీజేఏసీ) రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. జేఏసీ ప్రతినిధి బృందం టీఎస్ -ట్రాన్స్‌కో, టీఎస్-జెన్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఏఎం రిజ్వీతో ఇటీవల సమావేశమై రాష్ట్రంలోని అన్ని పవర్ ప్రాజెక్టులను టీఎస్-జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని వినతిపత్రం సమర్పించింది. జెన్‌కోకు చెందిన 62.5 మెగావాట్ల సామర్థ్యం గల రామగుండం- థర్మల్ పవర్ స్టేషన్‌ను మూసివేసి, 800 మెగావాట్ల యూనిట్‌ను స్థాపించడానికి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సిసిఎల్)కి ప్రాజెక్టుకు చెందిన 560 ఎకరాలను అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తోందని వారు సిఎండికి తెలిపారు. అక్కడ 2014కు ముందు తెలంగాణలో అనేక కొత్త థర్మల్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని భావించినా ఏపీ-జెన్‌కో ఒక్కటి కూడా అమలు చేయలేదని అంటున్నారు.. వీటిలో 600 మెగావాట్లు సింగరేణి థర్మల్ పవర్ స్టేషన్, 600 మెగావాట్లు లేదా 660 మెగావాట్లు రామగుండం టిపిఎస్, 800 మెగావాట్లు, కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్- 3, 700 మెగావాట్లు, కరీంనగర్ కంబైన్డ్ సైకిల్ గ్యాస్ పవర్ స్టేషన్ 1,000 మెగావాట్లు, శంకర్‌పల్లి గ్యాస్ పవర్ ప్రాజెక్ట్, గోదావరి నదిపై తుపాకులగూడ వద్ద 240 మెగావాట్ల సమ్మక్క సాగర్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ ఉన్నాయి.

# ప్రతిపక్షాలను ఢీ కొనేందుకు పక్కా ప్లాన్

వరంగల్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు పది నెలలు కావొస్తుంది. రైతు రుణమాఫీ నుంచి మూసీ సుందరీకరణ వరకు ప్రతీ అంశంపై అపోజిషన్ నుంచి ప్రెజర్ ఎదుర్కోటోంది అధికార పార్టీ. ఈ అంశాలపై జనంలో కూడా తీవ్ర చర్చనీయాంశం అవుతుండటంతో కాంగ్రెస్ పార్టీ అలర్ట్ అయింది. విపక్షాల విమర్శలను తిప్పికొట్టకపోతే జనం నుంచి మరింత వ్యతిరేకత వ్యక్తం అవుతుందని.. దీన్ని సాధ్యమైనంత త్వరగా యాక్షన్‌కు రియాక్షన్ ఉండాలని భావిస్తోంది. అందుకోసమే ఈ మధ్య కాంగ్రెస్ శాసనసభాపక్షం సమావేశం ఏర్పాటు చేసింది. కొత్త పీసీసీ చీఫ్‌కు సన్మానం పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపైనే చర్చించారు. ప్రభుత్వంలో భాగస్వామ్యమైన కార్పొరేషన్ ఛైర్మన్లతో పీసీసీ చీఫ్ సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఇప్పటి దాకా ఓ లెక్క. ఇప్పటి నుంచి మరో లెక్క అంటోంది తెలంగాణ కాంగ్రెస్. అంటే పద్దాం.. అపోజిషన్ కదా అని వదిలేశాం..ఇక కథ వేరే ఉంటదని చెప్తోంది. ప్రతిపక్షాల మాటకు ధీటుగా జవాబు ఇస్తామంటోంది. విపక్షాల విమర్శలను ఎలా తిప్పికొట్టాలనే దానిపై మేథోమథనం చేస్తోంది. అందుకోసం సరికొత్త వ్యూహంతో ముందుకెళ్లాలని చూస్తోంది కాంగ్రెస్. విపక్షాల వ్యూహాలను చిత్తు చేసేందుకు సరికొత్త అస్త్రాన్ని సిద్ధం చేసుకుంటోంది.కార్పొరేషన్ ఛైర్మన్ల సమావేశంలో సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ప్రధానంగా ఒక అంశాన్ని బలంగా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పదేళ్ల తర్వాత కార్యకర్తలు బలంగా పోరాడి సాధించిన అధికారాన్ని కలిసి కట్టుగా నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని సెంటిమెంట్‌ను రగిలించారట. ప్రభుత్వం అనేక మంచి పనులు చేస్తున్నా..వాటిని జనంలోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో విఫలమవుతున్నామనే అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. పెద్ద మొత్తంలో రుణమాఫీ చేసినా అనుకున్నంత పాజిటివ్ రాకపోగా..జనంలో నెగిటివ్ అవుతున్నామని ప్రస్తావించారు. రుణమాఫీ కాని రైతులకు కూడా త్వరలో రుణమాఫీ చేస్తామనే భరోసా క్యాడర్‌కు కల్పించాలని నేతలకు దిశానిర్దేశం చేశారట. ఇక హైడ్రా విషయంలో విపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడంలో విఫలమవుతున్న విషయాన్ని కూడా చర్చించారు. చెరువులు, పార్కుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ విషయంలో ప్రజల్లో పాజిటివ్ చర్చ జరిగేలా ప్రయత్నించాలని సీఎం, పీసీసీ చీఫ్ నేతలకు దిశానిర్దేశం చేశారు.ఇక మూసీ సుందరీకరణ విషయంలో పార్టీ గొంతు ఏమాత్రం జనంలోకి పోవడం లేదని అటు సీఎం, ఇటు పీసీసీ చీఫ్ ఇద్దరూ ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ విషయంలో గతంలో బీఆర్ఎస్, బీజేపీలు చెప్పిన హామీలను జనంలోకి తీసుకెళ్లాలని సూచించారు. పేదలు, మధ్య తరగతి ప్రజలకు కాంగ్రెస్ అండగా ఉంటుందనే భరోసా కల్పించడంలో వెనకబడిపోయామన్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ కూడా సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం చేసే కార్యక్రమాలను జనంలోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో పార్టీ ముందుండాలని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు సమిష్టిగా పనిచేస్తేనే త్వరలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి రిజల్ట్ వస్తుందని లేకపోతే పరిస్థితి చేయిదాటి..అందరూ మునిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో అపోజిషన్‌ను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ వేస్తున్న యాక్షన్ ఎంత వరకు వర్కౌట్ అవుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# నిజామాబాద్ లో బెర్త్ దక్కేది ఎవరికి...?

నిజామాబాద్: కాంగ్రెస్ పాలిటిక్సే డిఫరెంట్. ఎవరు ఎప్పుడు ఏ పదవి రేసులో ఉంటారో..ఎవరిని ఎందుకు పదవులు వరిస్తాయో అర్థం కావు. ఇప్పుడు ఇందూరు హస్తం పార్టీ పాలిటిక్స్ కూడా అలాగే ఉన్నాయి. అమాత్యులవారు అనిపించుకోవాలని ఇద్దరు ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నారు. ఒకరికి సీఎం మద్దతు ఉంటే.. మరొకరికి అధిష్టానం ఆశీస్సులు ఉన్నాయట.దాంతో ఇందూరు కాంగ్రెస్‌లో అమాత్య రేసు ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి సహా సీనియర్లు మాజీమంత్రికి జైకొడితే..ఢిల్లీ పెద్దలు మాత్రం జూనియర్‌కు సపోర్ట్ చేస్తున్నారట. రెండో విడత క్యాబినెట్ విస్తరణలో బెర్త్ దక్కుతుందని ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు ఆశతో ఎదురుచూస్తున్నారు. అయితే అందులో సీనియర్ ఎమ్మెల్యే..జూనియర్ ఎమ్మెల్యే మధ్య మంత్రి పదవి కోసం టఫ్ ఫైట్ జరుగుతుంది. బోధన్ ఎమ్మెల్యే మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు రేవంత్ క్యాబినెట్‌లో బెర్త్ కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నట్లు తెలుస్తోంది.నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డికి బెర్త్ దాదాపుగా ఖరారైనప్పటికి..ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు తన పేరు పరిశీలించాలంటూ రాహుల్ టీంతో ఒత్తిడి చేయిస్తున్నారట. దీంతో సుదర్శన్ రెడ్డి పేరు ఖరారైనా..మదన్ మోహన్ ప్రయత్నాలతో ఆ ప్రక్రియకు తాత్కాలిక బ్రేక్ పడుతుందనే చర్చ జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణ ఆలస్యానికి ఇదొక కారణంగా చెబుతున్నారట హస్తం పెద్దలు.మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి మొదటి విడతలోనే తనకు మంత్రి పదవి దక్కుతుందని భావించారట. అయితే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని రాజకీయ పరిణామాలతో బ్రేక్ పడిందనే ఓపెన్ సీక్రెట్. నిజామాబాద్ హస్తం పార్టీలో సీనియర్‌గా ఉన్న మాజీ మంత్రి షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారుడిగా నియమించారు సీఎం రేవంత్.మహేష్ కుమార్ గౌడ్‌కు పీసీసీ చీఫ్ పదవి దక్కింది. ఇక నాలుగు సార్లు గెలిచిన ఎమ్మెల్యేగా సీనియర్ కోటాలో సుదర్శన్ రెడ్డి మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. తన సీనియారిటీని, సిన్సియారిటీని పరిగణనలోకి తీసుకోవాలంటున్నారట సుదర్శన్ రెడ్డి. అయితే ఆయన రెడ్డి సేవలను స్పీకర్‌గా వాడుకోవాలని అధిష్ఠానం భావించినా..ఒప్పుకోలేదని తెలుస్తోంది. క్యాబినెట్ బెర్త్ కోసం పట్టుబట్టి ఓకే అనిపించుకున్నా..మదన్ మోహన్ పేరు తెరపైకి రావడంతో జస్ట్‌లో మిస్ అయినట్లు టాక్ వినిపిస్తోంది. రాహుల్ టీమ్ మదన్ మోహన్ పేరును ప్రస్తావిస్తుంటే?రాష్ట్ర నాయకత్వం సుదర్శన్ రెడ్డికి మద్దతిస్తున్నారట.ఇక కాబోయే మంత్రినంటూ సుదర్శన్ రెడ్డి జిల్లాలో హడవుడి చేస్తున్నారట. ఎవరు పోటీకి వచ్చినా సీనియారిటికే ప్రాధాన్యత ఉంటుందని సుదర్శన్ రెడ్డి చెప్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఇద్దరు ఎమ్మెల్యేలతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి సర్ధి చెప్పారని ప్రచారం జరుగుతోంది. మదన్ మోహన్‌కు చీఫ్ విప్ ఆఫర్ చేశారట. దీంతో సుదర్శన్ రెడ్డి లైన్ క్లియర్ అయిందని అంటున్నారు. మొత్తానికి పెద్దాయన పంతం నెగ్గించుకుని రేవంత్ రెడ్డి టీమ్‌లో బెర్త్ దక్కించు కోబోతున్నారని ఖుష్‌లో సుదర్శన్ రెడ్డి వర్గీయులు.

# నాగార్జున పొలిటికల్ టార్గెట్..

హైదరాబాద్: రాజకీయ నేతలు, సినిమాస్టార్లది అవినాభావ సంబంధమే. మరీ ముఖ్యంగా సినీ నటులకు పొలిటికల్ లీడర్లకు మధ్య సత్సంబంధాలు ఉండటం కామనే. అయితే.. ఇవి ఒక్కోసారి అనుకోని ఇబ్బందులుగా మారుతుంటాయి. ఇప్పుడు టాలీవుడ్ నటుడు అక్కినేని నాగార్జున ఫ్యామిలీ విషయంలోనూ ఇదే జరుగుతోందన్న చర్చ మొదలైంది. హైడ్రా.. ఈ పేరు చెబితే అంతా హడల్. హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతల అంశం ఇప్పుడు హాట్ టాపిక్‌గా రగులుతూనే ఉంది. హైడ్రా పేరు మార్మోగింది మాత్రం.. నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను కూల్చివేసినప్పుడే. సినిమా రంగంలో పెద్ద కుటుంబానికి చెందిన నాగార్జున ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను హైడ్రా కూల్చేసిందంట అనే వార్త అటు టాలీవుడ్‌లో, ఇటు పొలిటికల్ సర్కిల్స్‌లో తెగ హడావుడి చేసేసింది.దీనిపై రోజుల తరబడి చర్చోపచర్చలు జరిగాయి.

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి నాగార్జున సన్నిహితంగా మెలిగే వారని.. అందుకే ఆయన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌కు ఎసరొచ్చిందన్న వాదనలు టాలీవుడ్ అండ్ పొలిటికల్ సర్కిల్స్‌లో బాగా హల్ చల్ చేశాయి. అప్పట్లో నాగార్జున కోడలుగా ఉన్న ఇప్పటి మాజీ కోడలు , హీరోయిన్ సమంత తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండేవారు.ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. దీంతో బీఆర్ఎస్‌నే కాకుండా గతంలో ఆ పార్టీకి సన్నిహితంగా మెలిగిన వారిని కూడా రేవంత్ సర్కార్ టార్గెట్ చేసిందన్న వాదనలు ఉన్నాయి. అందుకే ఎస్పెషల్లీ టాలీవుడ్‌కు చెందిన వారిలో నాగార్జున టార్గెట్‌గా ఆయనకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను కూల్చారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఇష్యూలో రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకత కంటే సానుకూలతే ఎక్కువ వచ్చిందని చెప్పాలి.సీఎం రేవంత్ నాగార్జునను ప్రత్యేకంగా ఏమీ టార్గెట్ చేయలేదని.. హైడ్రా బాధ్యతల నిర్వహణలో భాగంగా తన, పర బేధం లేకుండా ఒకే ధోరణిలో వెళ్తోందన్న వాదనలు వినిపించాయి తనవాళ్లు, పరాయి వాళ్లనే తేడా లేకుండా ఆక్రమణల కూల్చివేతలో హైడ్రా పారదర్శకంగా వ్యవహరించిందని రేవంత్ సర్కార్‌పై కొందరు ప్రశంసలు కురిపించారు కూడా. ఆ తర్వాత దీనిపై పెద్దగా చర్చ జరగలేదు. సో.. ఈ ఇష్యూలో ప్రభుత్వానికి పాజిటివ్ మైలేజ్ బాగానే వచ్చిందని చెప్పాలి.అయితే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం డిఫెన్స్‌లో పడే సిచ్యుయేషన్ వచ్చింది. అది కూడా అక్కినేని నాగార్జున ఫ్యామిలీ గురించే. మంత్రి కొండా సురేఖ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శించారు. ఇందులో హీరో నాగచైతన్య, హీరోయిన్ సమంతల విడాకుల అంశం ప్రస్తావించడం పొలిటికల్ దుమారాన్ని రేపింది. అసలు నాగార్జున, చైతూ, సమంతలకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేకున్నా.. వారిని ఈ చర్చలోకి లాగడం పెద్ద వివాదమైకూర్చుంది.అటు రాజకీయ నేతల నుంచే కాకుండా ఇటు టాలీవుడ్ ప్రముఖుల నుంచి కూడా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఏ ఉద్దేశంతో వాళ్లను ఇందులోకి లాగి కాంట్రవర్సీని చేశారన్న చర్చ జరుగుతోంది. ఇది అనుకోకుండా జరిగిందా..? లేక వాంటెడ్‌లీ నాగార్జున ఫ్యామిలీ టార్గెట్‌గా జరిగిందా..? అనేది అందరిలో మెదులుతున్న ప్రశ్న. గతంలో నాగ్ బీఆర్ఎస్ సర్కార్‌తో రాసుకుపూసుకు తిరగడం వల్లే ఈ నిందలను పడాల్సి వస్తోందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.నాగార్జున ఎన్ కన్వెన్షన్‌ను కూల్చినప్పుడు ఇదంతా పరిపాలనా సంస్కరణలో భాగమన్న వాదనలు వినిపించాయి. రేవంత్ సర్కార్ చేసిన దాంట్లో పెద్ద తప్పేం లేదని.. ఎవరి ఒత్తిడిలకు ప్రభుత్వం లొంగకుండా ముక్కుసూటిగా వెళ్తోందన్న ప్రశంసలు దక్కాయి. అట్ ద సేమ్ టైమ్.. ఈసారి మాత్రం కొండా సురేఖ వ్యాఖ్యలతో రేవంత్ సర్కార్ డిఫెన్స్‌లో పడాల్సి వచ్చింది.తీవ్రమైన వ్యతిరేకత పొలిటికల్, సినీ వర్గాల నుంచి ఎదుర్కొంటోంది కాంగ్రెస్ సర్కార్. ఇది ఓరకంగా రేవంత్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసిందని అనుకుంటున్నారు. నిజంగానే నాగార్జునను టార్గెట్ చేసుకుని కావాలనే ఈ వ్యాఖ్యలు చేశారన్న నిందలు ప్రభుత్వంపై పడుతున్నాయి. మరి ఈ వివాదానికి ఎలా ముగింపు పలుకుతారనేది చూడాలి.

# సారీ చెబితే నష్టం పూడ్చినట్టేనా..?

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ అధిక్రం లో ఉన్న విషయం మనకు తెలిసిందే. ఇక ఆ పార్టీ లో ఫారెస్ట్ మినిస్టర్ గా కొనసాగుతున్న కొండా సురేఖ రీసెంట్ గా సమంతను అక్కినేని ఫ్యామిలీ ని ఉద్దేశించి కొన్నిసభ్యకరమైన వ్యాఖ్యలు అయితే చేసింది. ఇక దానిమీద పలువురు సినిమా సెలబ్రిటీలు సైతం చాలా ఘాటు గా రియాక్ట్ అయ్యారు. ఆమె మాట్లాడిన దాంట్లో చాలా వరకు తప్పు ఉందని చెప్పడంతో వెంటనే ఆమె తను అలా మాట్లాడడం తప్పు అంటూ అక్కినేని ఫ్యామిలీకి సమంతకు సారీ చెప్పింది. ఇక్కడితో రచ్చ మొత్తం ముగిస్తుందని అందరు అనుకున్నారు. కానీ ఇప్పుడు సారీ చెప్పినంత మాత్రాన ఆమె మాట్లాడిన మాటలు గాని వాళ్ళ గురించి జనాల్లోకి వెళ్లిన న్యూస్ కానీ వెనక్కి తిరిగిరాదు కదా?అందుకే ఏదైనా మాట్లాడే ముందు ఇలాంటివి ఒకటికి రెండుసార్లు చూసుకుని మాట్లాడితే బాగుంటుంది అంటూ పలువురు సినీ సెలబ్రిటీలు కూడా ఆమె మీద తీవ్రంగా ఫైర్ అవుతున్నారు. నిజానికి సినిమా సెలబ్రిటీల మీద రాజకీయ నాయకులు తరచుగా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ ఉంటారు. మరి వాళ్ళకి సినిమా ఇండస్ట్రీ అంటే ఎందుకు నచ్చదో ఎవరికి తెలియదు. ఇక మొత్తానికైతే వాళ్ళు చేసిన వాక్యాలు చిన్న సారీ తో సరిపెట్టుకునేవి అయితే కావు. దీనివల్ల ఎవరైతే కామెంట్స్ కి గురవుతారో వాళ్ళ కుటుంబాలు సఫర్ అవుతూ ఉంటాయి.అలాగే వాళ్ళ ఫ్యాన్స్ కూడా చాలా ఇబ్బందిని ఫేస్ చేస్తూ ఉంటారు. అందువల్లే ఒకసారి ఏదైనా మాట మాట్లాడేటప్పుడు ఒకటికి పది సార్లు ఆలోచించుకొని మాట్లాడితే బాగుంటుంది. మాట్లాడిన తర్వాత సారీ చెబితే జరిగిన నష్టాన్ని భర్తీ చేసే అవకాశం ఉండకపోవచ్చు. ఇక ఈ సంఘటన మీద కొండ సురేఖ సారీ చెప్పినప్పటికీ సమంత అభిమానులు గాని, అక్కినేని ఫాన్స్ గాని ఆమెను తీవ్రంగా విమర్శిస్తున్నారు.ఇక సగటు ప్రేక్షకుడు ఇలాంటి సంఘటనలు నిజంగానే జరిగాయా అని నమ్మే అవకాశాలు కూడా ఉన్నాయి. కాబట్టి జనం చేత ఎన్నుకోబడిన నాయకుడు జనాన్ని కాపాడాల్సింది పోయి ఇలాంటి చీప్ మాటలు మాట్లాడటం వల్ల వాళ్ల పరువును వాళ్ళు తీసుకోవడమే కాకుండా ఎదుటి వాళ్ళను కూడా ఇబ్బందుల్లోకి నెట్టిన వారవుతారు.ఇక ఇదిలా ఉంటే ఇప్పుడు జరుగుతున్న దాన్ని బట్టి చూస్తే ఆమె మీద అక్కినేని అభిమానులు సమంత అభిమానుల కోపం ఇంకా చల్లారినట్టుగా కనిపించడం లేదు. ఇక ఈ విషయం ఎక్కడి దాకా వెళుతుంది అనేది తెలియాలంటే మాత్రం మనం వేచి చూడాల్సిందే?

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

మేడ్చల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వంలో కల్పించిన మౌళిక వసతులను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశించారు.

మూడుచింతల పల్లిలోని కామిడి వీరారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టరు రాధికా గుప్తాతో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కామిడి వీరారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి భవనం, ఇన్ఫ్రాస్ట్రక్చర్, సౌకర్యాలు అన్ని బాగున్నాయని, వీటిని వంద శాతం వినియోగించాలని అన్నారు. రోజుకు ఎంత మంది ఓపి పేషంట్లు వస్తారని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. ఒపి పేషంట్ల సంఖ్యను పెంచేలా ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి అందించే వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యూపిహెచ్సిలో ఎంత మంది సిబ్బంది ఉన్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో అందించే వైద్య సేవల రికార్డుల గురించి అడిగి రిజిష్టర్లను పరిశీలించారు. ప్రసవాల సంఖ్య, వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్ గురించి అడిగి వాటి నమోదు రిజిష్టర్లను తనిఖీ చేసారు. రిజిష్టర్లలలో ఎప్పటి రికార్డులను అప్పుడే నమోదు చేయాలని రిజిష్టర్లలలో ఖాళీలు ఉండకూడదని సూచించారు. జ్వరాలు ఎక్కువగా విస్తరిస్తున్న సందర్భంగా జ్వరంతో వచ్చే పేషంట్లకు తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలని కలెక్టరు సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎంఅండ్ హెచ్ఓ రఘునాథస్వామి, మెడికల్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు కొత్త రైల్వే లైన్

హైదరాబాద్: తెలంగాణలో కొత్త రైల్వే లైను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఒడిసాలోని మల్కన్ గిరి నుంచి తెలంగాణలోని భద్రాచలం మీదుగా పాండురంగాపురం వరకు ఈ రైల్వే లైను నిర్మాణం కొనసాగుతుంది. మొత్తం 290 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఒడిసా, తెలంగాణ, ఏపీ, జార్కండ్, చత్తీస్ గడ్ ప్రాంతాల్లోని గిరిజన ప్రాంతాలను కలుపుతూ, సరకు రవాణాకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే ప్రాజెక్టుగా ఇది రూపుదాల్చనుంది. రూ.7383 కోట్లతో ఈ లైను నిర్మించేందుకు తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాకు కూడా దీనివల్ల అత్యధిక ప్రాధాన్యం దక్కబోతోంది. 34 వంతెనలు వస్తాయి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను, తూర్పు, ఈశాన్య రాష్ట్రాలకు అనుసంధానం చేయడంతోపాటు మహానది కోల్డ్ ఫీల్డ్ నుంచి దక్షిణ భారతదేశంలోని విద్యుత్తు తయారీ ప్లాంట్లకు బొగ్గు సరఫరాను వేగంగా చేయడానికి మార్గం సుగమం అవుతుంది. అంతేకాకుండా ఇనుప ఖనిజం, అల్యూమినియం పరిశ్రమలకు కూడా ఈ ప్రాజెక్టువల్ల భారీ లబ్ధి చేకూరనుంది. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సులభతరం అవుతుంది. ఈ మార్గంలో మొత్తం 34 పెద్ద వంతెనలతోపాటు 264 చిన్న వంతెనలు, 41 ఆర్వోబీలు, 76 ఆర్ యూబీలు నిర్మిస్తారు. భద్రాచలం వల్ల భారీ వంతెన నిర్మాణంలోకి వస్తుంది. ఖాజీపేట-విజయవాడ ప్రధాన మార్గానికి ఇది బ్రాంచ్ లైన్ అని చెప్పొచ్చు. తీర ప్రాంతానికి ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం తీర ప్రాంతంలో చెన్నై, నెల్లూరు, విజయవాడ, విశాఖపట్నం, భువనేశ్వర్ మీదగా కోల్ కతా వరకు రైల్వే లైను ఉంది. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఈ వరంగల్ - భద్రాచలం - మల్కన్ గిరి - జయపూర్ - టిట్లాగఢ్ మార్గం ప్రత్యామ్నాయంగా ఉంటుంది. దీనివల్ల బస్తర్ నుంచి దక్షిణ భారతదేశానికి 124 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. రాజమండ్రి, విశాఖపట్నం వంటి రద్దీ మార్గాలను దాటవేయడానికి అనువుగా ఉంటుంది. ఈ ప్రాజెక్టు వల్ల కోటి పనిదినాల ఉపాధి కార్మికులకు లభించబోతోంది.

# ప్రతి సి-సెక్షన్ ఆపరేషన్ కు ఆడిట్ ఫాం నమోదు చేయాలి

**- సి సెక్షన్ ప్రసవాలను 60 శాతానికి తగ్గించాలి**

**- సి సెక్షన్ అదికంగా చేస్తున్న ఆసుపత్రుల తనీఖీ**

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి: జిల్లాలో జరిగే ప్రతి సి- సెక్షన్ ప్రసవానికి సంబంధించి ఆడిట్ ఫాం నమోదు చేయాలని, సి- సెక్షన్ ఆపరేషన్ నియంత్రణకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సి- సెక్షన్ ప్రసవాల నియంత్రణ పై ప్రైవేట్ ఆస్పత్రుల గైనకాలజిస్ట్ డాక్టర్లతో సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మన పెద్దపల్లి జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులలో 90 శాతం సి- సెక్షన్ ప్రసవాలు జరుగుతున్నాయని, వీటిని 60 శాతానికి తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులలో 70 శాతం కంటే తక్కువ సి- సెక్షన్ ప్రసవాలు జరుగుతుండగా, మరికొన్ని ఆస్పత్రులలో 100 శాతం అవుతున్నాయని, సి- సెక్షన్ ఆపరేషన్ రేట్లు తగ్గించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి సి-సెక్షన్ ఆపరేషన్ సంబంధించి కేసు వివరాలను ఆడిట్ ఫామ్ నింపాలని అన్నారు. అధికంగా సి- సెక్షన్ ఆపరేషన్ నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులను రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి బృందాలు ఆకస్మికంగా తనిఖీ చేసి సి- సెక్షన్ ఆపరేషన్ ఆడిట్ చేస్తాయని అన్నారు. సి-సెక్షన్ ద్వారా ప్రసవాలు చేసే సమయంలో తగిన ప్రోటోకాల్ పాటించాలని, ప్రోటోకాల్ ప్రకారం ఫోటోగ్రఫీ ఇతర స్టెప్స్ ను రికార్డ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అనవసరపు సి- సెక్షన్ ఆపరేషన్ జరగడానికి ఎట్టి పరిస్థితుల్లో వీల్లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. గర్భిణీలను సాధారణ ప్రసవాల దిశగా ప్రోత్సహిం చాలని, సాధారణ ప్రసవం జరిగేందుకు పాటించాల్సిన పద్ధతుల పై వారికి అవగాహన కల్పించాలని అన్నారు. అంత కుముందు అనేమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా అనేమియా నివారణకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు , ప్రైవేట్ ఆస్పత్రుల గైనకాలజిస్ట్ డాక్టర్లు పాల్గొన్నారు.

# రైతుల అకౌంట్లలోకి డబ్బులు

**20 వేల కోట్లు నిధుల బదిలీ**

న్యూఢిల్లీ: పీఎం కిసాన్ యోజన డబ్బులు కోసం ఎదురు చూస్తున్న రైతులకు కేంద్రం శుభవార్త చెప్పింది. శనివారం ఉదయం రైతుల ఖాతాల్లో డబ్బులు వేయబోతోంది కేంద్రం. 9.5 కోట్ల మంది రైతుల ఖాతాల్లో 20 వేల కోట్లకుపైగా నిధులను బదిలీ చేయబోతోంది. మహారాష్ట్రలోని వాషిమ్ జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నిధులు విడుదల చేస్తారు.

రైతుల ఖాతాల్లో రెండు వేలు జమ

అర్హులైన రైతులందరికీ పిఎం కిసాన్ యోజన కింద సంవత్సరానికి రూ.6,000 సహాయం కేంద్రం అందిస్తోంది. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 17 విడతలుగా నిధులు అందిస్తూ వచ్చింది. 17వ విడత మొన్న జూన్‌లో రిలీజ్ అయింది. ఇప్పుడు 18 విడత నిధులు శనివారం విడుదల చేయనుంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతు ఖాతాల్లో నిధులు జమ చేస్తోంది కేంద్రం. 2 హెక్టార్ల వరకు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులంతా ఈ పథకానికి అర్హులు.

పిఎం కిసాన్ యోజన సొమ్ము ఖాతాల్లో జమ చేయాలంటే మాత్రం కేవైసీ తప్పనిసరిగా చేసి ఉండాలి. లేకుండా డబ్బులు వేయడానికి వీలుపడదని అధికారులు చెబుతున్నారు. పీఎం కిసాన్ యోజనకు అర్హులైన రైతులు మూడు విధాలుగా ఈ కేవైసీ చేసుకోవచ్చు. ఓటీపీ-ఆధారిత ఈ కేవైసీ, బయోమెట్రిక్-ఆధారిత ఈ కేవైసీ, నేరుగా బ్యాంకుకు వెళ్లి ఈ కేవైసీ చేసుకోవాల్సి ఉంటుంది.

ఓటీపీ ఆధారిత ఈ కేవైసీ : ఎలా ఎంచుకోవాలి

1. పీఎం కిసాన్ యోజన వెబ్‌సైట్‌కి వెళ్లి, కిసాన్ కార్నర్ సెక్షన్‌పై క్లిక్ చేస్తే అందులో ఈ కేవైసీ విభాగం ఉంటుంది. దానిపై క్లిక్ చేయాలి.

2. అందులో ఆధార్ నంబర్, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ ఎంటర్ చేయాలి. వెంటనే మీ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది దాన్ని అందులో ఎంటర్ చేయాలి.

3. ఓటీపీని ఫిల్ చేసిన వెంటనే ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి అయినట్టు సమాచారం వస్తుంది.

కొత్త ఈ పథకానికి అర్హులైన వాళ్లు ఈ ప్రక్రియను ఫాలో కావాల్సి ఉంటుంది.

1. నమోదు ప్రక్రియ

ఈ పథకం ప్రయోజనాలను పొందడానికి రైతులు ముందుగా తన పేరును నమోదు చేసుకోవాలి. అలా నమోదు చేసుకోకుంటే ప్రయోజనాలు కోల్పోతారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధాలుగా కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

2. ఆధార్ నంబర్‌కు లింక్ చేయడం

రైతుల భూ రిజిస్ట్రేషన్‌తో ఆధార్ నంబర్ అనుసంధానమై ఉండాలి. అలా లేకపోతే మాత్రం దరఖాస్తు పెండింగ్‌లో ఉంటుంది. ప్రభుత్వం సాయన్ని అందుకోలేరు.

3.భూమి యాజమాన్య హక్కు పత్రాలు

వ్యవసాయ భూమి తనదే అని చెప్పే యాజమాన్య హక్కు పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. భూమి మీది అయినా అది పేరు మీద లేకుంటే మాత్రం పథకానికి అర్హులుకారు.

4. మార్గదర్శకాలను అనుసరించడం

ఇతర వేరే కేంద్రం ఇచ్చే రైతు పథకాల సాయం తీసుకోని వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది. ఏదైనా ఇతర పథకం నుంచి ఆర్థిక సహాయం పొందుతే మాత్రం ఖఓ కిసాన్ యోజనకు అర్హులు.

# వినయ్ భాస్కర్ కు బిగిస్తున్న ఉచ్చు

వరంగల్: ఓరుగల్లు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య సవాళ్ల పర్వం నడుస్తోంది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు కేంద్రంగా ఈ ఛాలెంజ్ ల పర్వం మొదలైంది. కేటీఆర్ వ్యాఖ్యలతో మొదలైన ఈ పొలిటికల్ ఎపిసోడ్ పరస్పర దాడుల వరకూ వెళ్ళింది. నయీం నగర్ నాలాకు సంబంధించి ఎమ్మెల్యే నాయిని సవాల్ని స్వీకరించని బీఆర్ఎస్ నేతలు. ఆ మరుసటి రోజు అక్కడకి వెళ్లి హడావుడి చేశారు. ఆ క్రమంలో బీఆర్ఎస్ నేతలపై తీవ్ర ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే నాయిని.. పేదల దగ్గర కబ్జా చేసిన భూములు తిరిగివ్వడానికి పదిరోజులు డెడ్ లైన్ విధించడం పొలిటికల్ హీట్ మరింత పెంచింది.తెలంగాణలో హైదరాబాద్ తర్వాత రెండవ కీలకమైన నగరం వరంగల్. అలాంటి సిటీ గత కొన్ని సంవత్సరాలుగా చిన్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతూ కాలనీలన్నీ నీట మునుగుతున్నాయి. 2022లో కురిసిన వర్షాలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లోని సుమారు 38 కాలనీలు నీట మునిగి వేల మంది పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చింది. రెండవ రాజధానిగా పేరు ఉన్నప్పటికీ మౌలిక వసతులు కల్పన ముంపు సమస్యను తీర్చడంలో, గత పదేళ్లుగా బిఆర్ఎస్ నిర్లక్ష్యం వహించింది. అసెంబ్లీ ఎన్నికల ముందు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో మౌలిక వసతుల కల్పన కేంద్రంగానే రాజకీయాలు నడిచాయి. ఆ క్రమంలో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి కి భారీ మెజార్టీ గెలిపించారు హన్మకొండ ఓటర్లు.హనుమకొండ జిల్లాలో ప్రధాన సమస్య నయింనగర్ నాలా ముంపు సమస్య.. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నాలా వెడల్పు. రిటైనింగ్ వాల్ నిర్మాణం. నయీమ్ నగర్ బ్రిడ్జి నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికగా మొదలు పెట్టించి రికార్డు సమయంలో పూర్తి చేయించారు అంతేకాకుండా పదేళ్లుగా నిర్లక్ష్యంగా నడుస్తున్న కాళోజి కళాక్షేత్రాన్ని పూర్తి చేయించారు. మొత్తంగా గత పదేళ్ల నిర్లక్ష్యానికి 10 నెలల కమిట్మెంట్ కు తేడా చూడండి అంటూ ప్రజల్లోకి వెళ్తున్నారు ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి.వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తవుతుండటంతో వాటి క్రెడిట్ దక్కించుకోవాలని బీఆర్ఎస్ చూస్తుండటం విమర్శల పాలవుతుంది.. టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ పూర్తైన పనులన్నీ తన హయాంలోనే జరిగినట్లు ప్రచారం చేయడం మొదలుపెట్టారు. అంతేకాకుండా హనుమకొండ జిల్లా సమీక్ష సమావేశంలో స్వయంగా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం చేసిన పనులను కాంగ్రెస్ ఎమ్మెల్యే తాను చేసినట్లుగా చెప్పుకొని పూలాభిషేకాలు చేసుకుంటున్నారని వ్యంగ్యంగా మాట్లాడారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యేని వాడు వీడని ఏకవచనంలో సంభోదించడం వివదాస్పదంగా మారింది.కేటీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నయింనగర్ నాలా పనులు ఎవరు చేశారో నిరూపించాలని ఛాలెంజ్ విసిరారు. 29వ తేదీన 10 గంటలకు నయింనగర్ బ్రిడ్జి పైకి కేటీఆర్ వస్తే, ఎవరిపై ప్రజలు రాళ్ళేస్తారో, ఎవరిపై పువ్వులు వేస్తారో చూద్దామని సవాల్ విసిరారు. చెప్పినట్లుగానే నాయిని రాజేందర్ రెడ్డి నయింనగర్ బ్రిడ్జిపైకి స్థానికులతో కలిసి వెళ్ళారు. కేటీఆర్ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ మహిళలు చీరె, గాజులు సైతం తీసుకెళ్ళి, ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోమని కేటీఆర్ కు, బీఆర్ఎస్ శ్రేణులను హెచ్చరికలు జారీ చేశారు? బీఆర్ఎస్ శ్రేణుల కోసం ఎమ్మెల్యే నాయిని గంటసేపు బ్రిడ్జిపై ఎదురుచూసినా వారు స్పందించలేదు. ఆ క్రమంలో పార్టీ ఆఫీసు కోసం పార్కును కబ్జా పెట్టిన వారు అబద్దాల ప్రచారాలు చేసుకుంటున్నారని నాయిని తీవ్ర స్థాయితో మండిపడ్డారు.అయితే మరసటి రోజు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్భాస్కర్ తన అనుచరులతో ర్యాలీగా నయీమ్ నగర్ బ్రిడ్జి పైకి వచ్చి బ్రిడ్జి నిర్మాణానికి నిధులను గత సర్కారీ విడుదల చేసిందని తాను బ్రిడ్జి నిర్మాణం మొదలుపెట్టే లోపే ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిందని బ్రిడ్జి క్రెడిట్ ను తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేశారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అక్రమాలకు పాల్పడుతున్నారని దోచుకున్న సొమ్మును విదేశాలకు తరలిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.ఈ క్రమంలో కాంగ్రెస్ శ్రేణులు సైతం బ్రిడ్జి వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కేటీఆర్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేయగా, సీఎంకు, ఎమ్మెల్యే నాయనికి వ్యతిరేకంగా టిఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు. దాంతో రెండువర్గాలు ఒకరిపై ఒకరు దూసుకొచ్చి ఘర్షణకు దిగడంతో పోలీసులు ఎంట్రీ ఇచ్చి చెదరగొట్టారు. సుమారు గంట పాటు నయీమ్ నగర్ బ్రిడ్జి వద్ద హైడ్రామా నడిచింది. చివరకు మాజీ ఎమ్మెల్యే వినయ్భాస్కర్ను పోలీసులు అరెస్ట్ చేయడంతో ఉద్రిక్తతకు తెరపడింది.మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ చేసిన వ్యాఖ్యలకు మరోసారి ఎమ్మెల్యే నాని నాగేందర్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. బీసీ పేరు చెప్పుకొని బీసీలను అణగతొక్కిన చరిత్ర వినయ్ భాస్కర్దని మండిపడ్డారు. తనపై చేసిన ఆరోపాలను నిరూపించాలని మరోసారి సవాల్ విసిరారు. వినయ్ భాస్కర్ చరిత్ర బయటపెడితే మద్రాస్ కు పారిపోవాల్సిందేనని ఫైర్ అయ్యారు. పదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని పేదల దగ్గర దోచుకున్న భూములను తిరిగి వారికివ్వాలని.. దానికి పది రోజుల డెడ్లైన్ విధించారు .. లేకుంటే వినయ్ భాస్కర్ బాధితుల సంఘం ఏర్పాటు చేసి ప్రజల ముందు తన చరిత్రను బయటపెడతానని తీవ్ర హెచ్చరికలు చేశారు.పదేళ్లు అభివృద్ధిని పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు, 10 నెలల కాంగ్రెస్ పాలనలో పనులు పూర్తి చేయగానే, ఆ క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవాలని చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొట్టాయనే చర్చ హన్మకొండలో జరుగుతోంది. అభివృద్ధి పనుల అంశం పక్కనపెడితే బీఆర్ఎస్ నేతల అవినీతి అక్రమాలను ఎమ్మెల్యే నాయిని ఒక్కొక్కటిగా బయటపెడుతుండటంతో ఎరక్కపోయి, ఇరుకున్నమనే భావన బీఆర్ఎస్ శ్రేణుల్లో వ్యక్తమవుతుంది.

## హార్ట్ డే బ్యానర్ ఆవిష్కరణ



జయశంకర్ భూపాలపల్లి: ఓల్డ్ హార్ట్ డే బ్యానర్ ఆవిష్కరించిన జయశంకర్ భూపాలపల్లి డి ఎం ఎన్ హెచ్ ఓ డాక్టర్ మధుసూదన్. ఈ యొక్క ప్రోగ్రాం వారం రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గుండెపోటుతో మరణిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడం వలన తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేయడం యొక్క ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశమని అన్నారు. మండలాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని డిప్యూటీ డిఎన్ఏ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవి రాథోడ్ తెలియజేశారు. 50 ఏళ్లు దాటిన వారు మాంసా కృతులు తీసుకోకూడదని శాకాహారం మాత్రమే తీసుకోవాలని తెలిపారు. రక్తనాళాలలో కొవ్వు పేరుకొని గుండె పోటుకు దారితీస్తుందని దీనివలన సడన్ గా హార్ట్ ఎటాక్ కానీ ఫ్రెండ్స్ తో గాని రావచ్చునని, 50 ఏళ్లు పైబడిన వారు ప్రతి ఒక్కరు లిపిడ్ ప్రొఫైల్ ద్వారా వారి శరీరంలోని కొవ్వు శాతాన్ని గుర్తించి ఇంతకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు

ఈ కార్యక్రమంలో డెమో శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు

## జిల్లా లో కొనసాగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే

ఖమ్మం: ఖమ్మం జిల్లాలో పైలట్ సర్వే క్రింద చేపడుతున్న తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలం రాములు తాండ గ్రామ పంచాయతీలో చేపడుతున్న సర్వే ను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. సర్వే లో భాగంగా కుటుంబం నుండి సేకరిస్తున్న వివరాలను కలెక్టర్ పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫోటోను కలెక్టర్ స్వయంగా మొబైల్ చేతపట్టి తీశారు.కలెక్టర్ మాట్లాడు తూ, జిల్లాలోని కుటుంబాలకు ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి పైలట్ సర్వే క్రింద నియోజకవర్గంలో 2 ప్రాంతాలు, ఒకటి పట్టణ, రెండోది గ్రామీణ ప్రాంతంలో ఎంచుకొని చేపడుతున్నట్లు తెలిపారు. కుటుం బంలో పెద్ద మహిళను కుటుంబ పెద్దగా చూపెట్టాలని ఆయన తెలిపారు. ప్రతి కుటుంబానికి ఒక ఐడి, కుటుంబం లో ఉన్న ప్రతి సభ్యునికి ఒక్కో ఐడి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. వివరాల సేకరణలో ఆధార్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఒక రాష్ట్రం, ఒక కార్డ్ క్రింద రాష్ట్రంలో కుటుంబ గుర్తింపు కార్డుగా ఉంటుందని ఆయన తెలిపారు. అధికారు లకు వివరాలు అందించి, సర్వే కు సహకరించాలని కలెక్టర్ కోరారు.

# ఆడవాళ్లు అంటే చులకన...

హైదరాబాద: చులకన... ఆడ పిల్లలు అంటే చులకన...
అందులోనూ హీరోయిన్లు అంటే ఇంకా చులకన...
ప్రేక్షకులే కాదు... ప్రభుత్వ పెద్దలలోనూ అదే చులకన...
బహుశా... ఆడదానికి ఆడది శత్రువు అంటే ఇదేనేమో!?

అక్కినేని నాగ చైతన్య, సమంత విడాకుల వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తీసుకువచ్చారు కొండా సురేఖ. ఆవిడ చెప్పిన మాటల్ని ఆల్మోస్ట్ అందరూ వినే ఉంటారు. ఇంకోసారి వాటిని ఇక్కడ ప్రస్తావించాలని అనుకోవడం లేదు. కానీ, గౌరవప్రదమైన పదవిలో ఉన్న కొండా సురేఖ ఆ విషయాన్ని ఇప్పుడు బయట పెట్టడం వెనుక అంతర్యం ఏమిటి? ఫక్తు రాజకీయం తప్ప మరొకటి ఏముంది?కొండా సురేఖ ప్రజల్లో ఉన్న మనిషి. పలుకుబడి ఉన్న మహిళ. అధికారంలోకి వచ్చిన తర్వాత కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను ఇరుకున పెట్టడానికి కాకపోతే ఇప్పుడు ఎందుకు ఆయనకు సమంతకు ముడిపెట్టి ఈ వ్యాఖ్యలు చేయడం? విడాకులు తీసుకున్నప్పుడు సురేఖ ఎక్కడ ఉన్నారు? అప్పుడు ఆమె అధికారంలో లేకపోవచ్చు... కానీ, సాటి మహిళకు అండగా గళం వినిపించే అంత ధైర్యం లేదా? అధికారంలో ఉన్న వ్యక్తులను ప్రశ్నించే గుణం లేదా? లేదంటే ఆ సమయంలో ఎవరు ఎటు పోతే నాకెందుకు అని ఊరుకున్నారా? ఇప్పుడు తనపై ట్రోలింగ్ వచ్చేసరికి కేటీఆర్ మీద విమర్శలు చేశారు. లేదంటే ఆ విషయం వదిలి ఊరుకునేవారా? తనకు అవమానం జరిగితే తప్ప వేరొక మహిళకు జరిగిన అన్యాయం కొండా సురేఖకు గుర్తు రాలేదా?కొండా సురేఖ కేవలం కేటీఆర్ మీద ఆరోపణలు చేయలేదు. తెలుగు చిత్రసీమతో పాటు తమిళ, హిందీ చిత్ర పరిశ్రమలలో ఎంతో గౌరవం, మన దేశ ప్రజలలో ఎంతో పలుకుబడి ఉన్న అక్కినేని కుటుంబం మీద ఆవిడ అబాండాలు వేశారు. అక్కినేని ఫ్యామిలీకి ఉన్న ఆస్తిలో ఎన్ కన్వెన్షన్ విలువ చాలా అంటే చాలా చాలా చాలా తక్కువ. ఆ విలువ ఎంతన్నది పక్కన పెట్టండి. ఆస్తి కోసం విలువల్ని అక్కినేని ఫ్యామిలీ పణంగా పెడతారని చౌకబారు దిగజారిన మాటలు కొండా సురేఖ వ్యాఖ్యల్లో ఉన్నాయి. అక్కినేని ఫ్యామిలీ పరువు ప్రతిష్టలను కించ పరిచే విధంగా మాత్రమే కాదు... ఇండస్ట్రీలో హీరోయిన్లపై, ఆ మాటకు వస్తే ఆడపిల్లల మీద ఆవిడ మనసులో ఎటువంటి గౌరవం లేదనే విషయం అర్థమవుతుంది.సమాజంలో మహిళలకు భద్రత కల్పించాల్సిన స్థానంలో, ప్రభుత్వంలోని ఒక కీలక పదవిలో కొండా సురేఖ ఉన్నారు. మహిళల మీద ఎవరైనా విమర్శలు చేస్తే, మహిళ గౌరవానికి భంగం వాటిల్లితే ఖండించాల్సిన బాధ్యత ఆమెపై ఉంది. ఒక మహిళగా సాటి మహిళకు అండగా నిలవాలని ప్రతి ఒక్కరూ ఆశించేది. అయితే... ఓ రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పదవిలో ఉన్న మహిళా మంత్రి ఇంకెంత బాధ్యతగా ఉండాలి? అటువంటివి ఏమీ లేకుండా అక్కినేని కుటుంబాన్ని, సమంతను చులకన చేసేలా కొండా సురేఖ మాట్లాడడం ఎంతవరకు సబబు? ఎందుకు అంత దూర దృష్టితో ఆవిడ ఆలోచించ లేకపోయారు? పోరు గడ్డ (వరంగల్) నుంచి ప్రభుత్వంలోని పదవి వరకు కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి ప్రజలకు తెలుసు. కానీ, కొండా సురేఖ చేసిన తాజా వ్యాఖ్యలు వారి కుటుంబ ప్రతిష్ట మీద మచ్చ అని చెప్పడంలో ఎటువంటి సందేహం అవసరం లేదు. మహిళగా ఆమె స్థాయిని దిగజార్చాయని చెప్పడంలోనూ సందేహం అవసరం లేదు. పదవి లేని సమయంలో సమంతకు కొండా సురేఖ ఎందుకు అండగా నిలబడలేదు? ఆ సంగతి వదిలేద్దాం... అత్యాచార ఘటనలలో బాధిత మహిళ పేరు బయటకు చెప్పకూడదని న్యాయస్థానాలు చెబుతాయి కదా. కోర్టుల వరకు ఎందుకు? సాటి మనిషిగా బాధితురాలి పేరు చెబితే ఆమె భవిష్యత్తు ఎలా ఉంటుందోనని మనమే ఆలోచిస్తాం కదా! ఆ విచక్షణ కొండా సురేఖకు ఎందుకు లేకుండా పోయింది? ఒక్క క్షణం కొండా సురేఖ వెర్షన్ నిజమే అని అనుకుందాం... అప్పుడు ఆవిడ చెప్పిన మాటల ప్రకారం సమంత బాధితురాలే కదా! సమంత పేరు చెప్పకూడదని ఇంగితం ఎందుకు లేకుండా పోయింది? సమంత మీద విమర్శలు చేశారు. నిన్న మొన్నటి వరకు రకుల్ ప్రీత్ సింగ్ మీద కొందరు రాజకీయ నాయకులు విమర్శలు చేశారు. లేదంటే ఓ పార్టీకి చెందిన డిజిటల్ టీమ్ కేటీఆర్, రకుల్ ఫోటోలతో మీద ట్రోలింగ్ నడిపింది. రేపు ఇంకొక మహిళ మీద చేయరనే గ్యారెంటీ ఏమిటి? తెలంగాణ రాజకీయాలకు ప్రతిసారి ఎవరో ఒక మహిళ బలి పశువు కావాలా? మీ రాజకీయాలకు మరో మహిళను ఎందుకు పావుగా వాడుతున్నారు? బలి పశువు చేస్తున్నారు? ఆడపిల్లల పేర్లు తీయకుండా మీరు రాజకీయాలు చేయలేరా? ఆడపిల్లలు అంటే ఎందుకు అంత చులకన?? ఇప్పటివరకు తెలంగాణ రాజకీయాలలో హీరోయిన్లతో ముడిపెడుతూ విమర్శలు చేయడం తప్ప ఏనాడైనా ఆధారాలు చూపించారా? ఓ సాటి మహిళగా మరొక మహిళ మీద ఇటువంటి విమర్శలు చేసే ముందు సమాజంలోకి ఎటువంటి సంకేతాలు పంపిస్తున్నాం? అనేది ఈ రాజకీయ నాయకులు ఎందుకు ఆలోచించలేకపోతున్నారు? లేదంటే రాజకీయాలలో వ్యభిచారం ఉందని పరోక్షంగా అంగీకరిస్తున్నారా? తప్పండి... మీ రాజకీయ ప్రత్యర్థుల మీద విమర్శలు చేయడానికి మహిళలను బలి పశువులు చేయడం చాలా తప్పు! గంటకు ఓ అత్యాచారం, రోజుకు ఒక హత్యాచారం... దేశంలో ఇంతేనేమో!? ఎప్పటికీ పరిస్థితులు మారవేమో!? అని కొందరు ప్రజలు అలవాటు పడొచ్చు. కానీ, ఇలా ఎన్నాళ్ళు? ఇంకా ఎన్నేళ్లు? మహిళల మీద, ఇంకా ముక్కుపచ్చలారని చిన్నారుల మీద యదేచ్ఛగా జరిగే ఈ దాడులు?? వీటికి అడ్డుకట్ట పడదా??? అసలు లోపం ఎక్కడ ఉందని ఆలోచిస్తే... కొందరి ఆలోచనల్లో ఉందనిపిస్తుంది. కొండా సురేఖ వంటి మహిళలు చేసే అనాలోచిత, స్వార్థపూరిత రాజకీయ విమర్శల్లోనూ ఉందనిపిస్తుంది.సమాజంలో హీరోయిన్లు అంటే చాలా చులకన భావం ఉంది. అత్యాచారాలకు కారణం మహిళల దుస్తుల నుంచి హీరోయిన్ల వేషధారణ వరకు అని కామెంట్ చేసే జనాలు మనలో ఉన్నారు. హీరోయిన్లు కావడానికి ముందు వారూ సమాజంలో సాటి మహిళలు అని గుర్తించండి. ప్రభుత్వాలలో ఉన్నత స్థాయిలలో ఉన్న వ్యక్తులు ఆయా హీరోయిన్ల మీద విమర్శలు చేస్తే కింది స్థాయిలో సామాన్యులు తమ ఇరుగుపొరుగు అమ్మాయిల మీద ఎటువంటి వ్యాఖ్యలు చేస్తారో ఆలోచించండి! హీరోయిన్లను తక్కువ చేసి, వాళ్లను అంగడిలో ఆటబొమ్మలుగా చిన్న చూపు చూడటం మానేసి, సాటి మహిళగా వాళ్లకు మరొక మహిళ గౌరవం ఇచ్చిన రోజున అందరిలో మార్పు మొదలవుతుంది. తప్పకుండా మొదలై తీరుతుంది.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### డిజిటల్ కార్డుల సర్వేను పకడ్బంధిగా నమోదు చేయాలి

### జగిత్యాల జిల్లాలో పర్యటించిన హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ ఆఫీసర్ ఆర్.వి. కర్ణన్

జగిత్యాల: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జగిత్యాల జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు.శుక్రవారం రోజున జిల్లా కేంద్రంలోని మాత శిశు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అందిస్తున్న వైద్య సేవలు గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డ్ చెత్తను ఎక్కడికి తరలిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు.అనంతరం అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా చేపట్టిన డిజిటల్ ఫ్యామిలీ సర్వేలో భాగంగా పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ మరియు రూరల్ మండలం అంతర్గాం ఓడ్డెర కాలనీ జరుగుతున్న సర్వేలో స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంలో అధికారులతో స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ, కుటుంబ నిర్ధారణ వివరాలు తప్పులు లేకుండా పకడ్బంధిగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, ఆర్డీవో శ్రీనివాస్, డిఎంహెచ్ఓ డాక్టర్ సమియుద్దీన్, తహసిల్దార్, ఎంపీడీవో మాత శిశువు ఆస్పత్రి వైద్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మూసి ముందుకు సాగేనా

హైదరాబాద్: మూసీ సుందరీకరణ తెలంగాణలో రాజకీయ మంటలు రేపుతోంది. సుందరీకరణ చేసి తీరుతామని అధికార పార్టీ కుండబద్ధలు కొట్టి చెప్తుంటే.. పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లు కూల్చి ఎలా ముందుకు వెళ్తారో తాము చూస్తామంటూ విపక్షాలు సవాల్ విసురుతున్నాయి.మూసీ సుందరీకరణ.. తెలంగాణ రాజకీయాల్లో కాక రేపిన అంశం. కాంగ్రెస్ ఎబ బీఆర్ఎస్ గా మారిపోయింది ఈ ఇష్యూ. నార్సింగి టు నాగోల్. 55 కిలోమీటర్ల మేర రూపురేఖలు మార్చి కమర్షియల్ హబ్గా మార్చుతామని అంటోంది రాష్ట్ర ప్రభుత్వం. ఈ క్రమంలో ఆక్రమణలను తొలగించేందుకు సిద్ధమైంది. సుందరీకరణ పనుల్లో భాగంగా చాదర్ఘాట్ మూసీ పరిధిలో నదీ గర్భంలో ఉన్న ఇండ్లను అధికారులు కూల్చివేస్తున్నారు. ఇక్కడ ఉన్న 140 నిర్వాసిత కుటుంబాలను చంచల్గూడ డబుల్ బెడ్ రూమ్ అపార్ట్మెంట్లలోకి తరలించారు..అయితే సర్కారు చర్యలపై ప్రతిపక్షాలు కన్నెర్ర చేస్తున్నాయి. ఇది అభివృద్ధినా? పేదలను రోడ్డు మీద వేయడమా అని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. అది బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. మూసీ ప్రక్షాళన విషయంలో ప్రభుత్వ చర్యలను విపక్షాలు తప్పుబడుతున్నాయి. అది బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్ అంటున్నారు బీఆర్ఎస్ వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. మూసీ ప్రాజెక్టు రాహుల్ డైరెక్షన్లో నడుస్తుందన్నారు. కర్ణాటక సీఎం స్కాంలో ఇరుకున్నారు. అక్కడ డిప్యూటీ సీఎం డబ్బులు ఇచ్చే పరిస్థితి లేదు. అందుకే తెలంగాణ నుంచి బంగారు బాతుగా మూసీ ప్రాజెక్టును ఎంచుకున్నారని ఖుఖీ విమర్శించారు. కూల్చివేతల గందరగోళ వాతావరణంతో తెలంగాణలో పండుగ సందడే లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు.మూసీ ప్రాజెక్ట్పై మా విజన్ ఏంటనేది.. రెండు, మూడు రోజుల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామంటున్న కేటీఆర్, ప్రాజెక్ట్కు సంబంధించి ప్రభుత్వం దగ్గర డీపీఆర్ కూడా లేదంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్పై కేసీఆర్ గతంలో 3 గంటల ప్రజెంటేషన్ ఇచ్చారు. మూసీపై ప్రభుత్వం 3 నిమిషాల వివరణ ఇవ్వగలదా? అని ప్రశ్నిస్తున్నారు. అయితే మూసీ విషయంలో రాహుల్గాంధీని లాగడమెందుకు? ఏమైనా ఉంటే లోకల్గా మనం.. మనం చూసుకుందామంటున్నారు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి.అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్కు ఓటు వేయని కారణంగానే ప్రభుత్వం కక్ష కట్టిందని ఆరోపిస్తోంది బీఆర్ఎస్. దీనికి కౌంటర్ ఇచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్పై ఏ పార్టీకి ప్రేమ ఉందో ప్రజలకు తెలుసన్నారు. కక్ష కట్టింది కాంగ్రెసా? బీఆర్ఎస్సా? అని ప్రశ్నించారు.మరోవైపు, కూల్చివేతలను అడ్డుకుని తీరుతామని అంటున్నారు కమలం పార్టీ నేతలు. లక్షన్నర కోట్లతో సుందరీకరణ అవసరమా? అంత బడ్జెట్ భరించే శక్తి రాష్ట్రానికి ఉందా? కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. అక్బరుద్దీన్తో కలిసి లండన్ వెళ్లి లండన్ మాదిరి చేస్తామంటే ఎలా కుదురుతుందని ప్రశ్నిస్తున్నారు. రోడ్లు వేసి, నీళ్లు ఇచ్చి, అనుమతులు ఇచ్చిన ప్రభుత్వమే కూలుస్తా అంటే ఎలా అంటున్నారు కిషన్ రెడ్డి. మూసీకి రిటైనింగ్ వాల్ కడితే సరిపోతుదంటున్న కేంద్ర మంత్రి.. కూల్చివేతలను అడ్డుకొని తీరుతామని అంటున్నారు.మూసీ బాధితులకు చంచల్గూడలో డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లను స్థానిక ఓఎఓ ఎమ్మెల్యే బలాల తనిఖీ చేశారు. అక్కడ ప్రజలకు ఎలాంటి వసతులు కల్పించారన్న దానిపై ఆరా తీశారు. బాధితులందరికి అన్ని వసతులతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలి. అలా కాకుండా ఇల్లు కూలుస్తామంటే ఒప్పుకునేది లేదంటున్నారు.బీఆర్ఎస్పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. మూసీ ప్రాజెక్ట్పై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. అసలు కేటీఆర్, హరీష్రావుకు మానవత్వం ఉందా? అని ప్రశ్నించారు. ఒక్కసారి నల్లగొండకు వచ్చి ఇక్కడి పరిస్థితులు చూడాలన్నారు. అవసరం లేకున్నా బీఆర్ఎస్ మల్లన్నసాగర్ కట్టిందన్నారు మంత్రి కోమటిరెడ్డి. మీకు గోదావరి నీళ్లు.. మాకు మూసీ నీళ్లా? అని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా అంటే బీఆర్ఎస్కు ఎందుకంత కోపమో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ను ఓడించినందుకు నల్లగొండపై పగబట్టారని ఆరోపించారు.సో.. ఇప్పుడు మూసీ అంశం హైదరాబాద్ దాటి.. తెలంగాణ జిల్లాలకు వెళుతోంది. అయినా ప్రభుత్వం ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. మూసీ ప్రక్షాళన చేసి తీరుతామంటోంది. కాని విపక్షాలు మాత్రం పేదలు ఇళ్లు కూల్చితే అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నాయి.

## మౌలిక సదుపాయాలు, ఇల్లు కోసం పోరు పాదయాత్ర

భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని వెన్నెల నగర్ లోని ప్రజలకు 75 గజాలు స్థలమిచ్చి ఈరోజు వరకు వారికి సరైన ఇల్లు, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో పలు మార్లు మున్సిపల్ అధికారులకు సమస్య తెలిపినా పట్టించుకోకపోవడంతో సేవ్ కొత్తగూడెం- సేవ్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు ప్రజలు పోరు పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా పోస్ట్ ఆఫీస్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పాదయాత్ర చేపట్టారు. ఈసందర్భంగా జలాల్ మాట్లాడుతూ.... గత కొంతకాలం క్రితం 75 గజాలు స్థలం ఇచ్చిన ప్రభుత్వం వారికి కనీస ఇల్లు, మౌలిక సదుపాయాలు కల్పించకపోతే నిరుపేదలు ఎలా జీవించాలని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇల్లు లేని వారికి డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వాలని, 832 కుటుంబాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**